SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 19 | సంచిక: 290 | ఎడిటర్ : అలీ ముర్తుజా | గురువారం 10 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

## మా ఎమ్మెల్యేలపై దాడి.. మాపైనే కేసులా?

- గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు
- పోలీసుల తీరుపై ఆధారాలు ఇచ్చామన్న కేటీఆర్
- సబిత, సునీత ఘటనలను వివరించిన నేతలు
- హామీల అమల్లో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపణ
- రాష్ట్ర పరిస్థితులపై జోక్యం చేసుకోవాలని వినతి

3





## బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

- ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..
- తెలంగాణలో అధికారంలోకి వస్తాం
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

3

## ఆయుష్ విద్యార్థులకు 'డబుల్' ధమాకా!

- హౌస్ సర్జన్లకు రూ.29,792
- పీజీలకు రూ.74,482 స్టైఫండ్
- భారీ పెంపుతో ప్రభుత్వం జీవో
- అల్లోపతి మెడికోలతో సమానంగా చెల్లింపులు
- మంత్రి దామోదర్‌కు విద్యార్థుల కృతజ్ఞతలు

రాష్ట్రంలోని ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి (ఆయుష్) విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆయుష్ మెడికోల స్టైఫండ్‌ను అల్లోపతి వైద్య విద్యార్థులతో సమానంగా భారీగా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

2





## భారతరత్నకు 'సర్' కష్టాలు

- ఒక్క అక్షరం తేడాతో చిక్కులు!
- పాత, కొత్త ఓటరు జాబితాల్లో పేరు సరిపోలలేదని సమాచారం
- ఈసీ నోటీసులు పంపినట్లు ప్రచారం
- నోటీసులేవీ అందలేదన్న రావు ప్రతినిధి
- గతంలో పద్మశ్రీ హాజబ్బకూ ఇదే సమస్య

4

# కుట్రదారులెవరైనా వదిలిపెట్టం!

## వరుస ఘటనలపై సమగ్ర విచారణ



**దోషులపై క్రిమినల్ కేసులు ■ స్పీకర్‌కు ప్రభుత్వం అండగా ఉంటుంది**

**ప్రజా సమస్యలపై చర్చను అడ్డుకున్నారని ఆరోపణ**

**అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ**

శాసనసభ వర్షాకాల సమావేశాల ప్రారంభంలో చోటుచేసుకున్న కుట్రపూరిత సంఘటనలను ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని సభా నాయకుడు, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఉదంతంలో భాగస్వాములైన బాధ్యులందరిపై సమగ్ర విచారణ జరిపించి, క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని ఆయన ప్రకటించారు. సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారిని ఉద్దేశించి దుర్భాషలాడటం, దళితులు నడిచిన నేలను శుద్ధి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం శాసనసభలో జరిగిన సుదీర్ఘ చర్చకు సీఎం సమాధానమిచ్చారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో చోటుచేసుకున్న ఘటనల వెనుక కుట్ర ఉందని, అందుకు బాధ్యులైన వారందరిపై సమగ్ర విచారణ జరిపించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దర్యాప్తులో దోషులుగా తేలిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని స్పష్టం చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ఈ అంశాలపై బుధవారం శాసనసభలో జరిగిన సుదీర్ఘ చర్చకు సభా నాయకుడిగా సీఎం సమాధానమిచ్చారు. స్పీకర్‌కు ప్రభుత్వం, శాసనసభ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. జరిగిన ఘటనలతో మానసిక ధైర్యం కోల్పోవద్దని స్పీకర్‌ను కోరారు. సభాపతి మనసును గాయపరిచిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.

మిగతా 2 లో

## దళితులు నడిచిన నేలను శుద్ధి చేస్తారా?

- ఎర్రవల్లి ఘటనపై సీఎం రేవంత్ ఆగ్రహం
- డప్పులతో నిరసన తెలపడం ప్రజాస్వామ్య హక్కు
- శుద్ధీకరణ చేయడం అమానవీయమని మండిపాటు
- ఫామ్‌హౌస్ వేదికగా కుట్రలు రచించారని ఆరోపణ
- ప్రజాస్వామ్య వ్యవస్థనే అవమానించారన్న సీఎం

2





# బీఆర్ఎస్‌కు బిగ్ షాక్!

**శాసనసభ నుంచి కేటీఆర్, హరీశ్ సహా 22 మంది సస్పెండ్**

### సెషన్ మొత్తానికి సభ నుంచి వేటు

- శ్రీధర్‌బాబు తీర్మానానికి స్పీకర్ ఆమోదం
- నినాదాలతో సభకు ఆటంకమంటూ చర్య
- స్పీకర్‌ను కలువకుండా అడ్డుకున్న మార్షల్స్

2

శాసనసభ వర్షాకాల సమావేశాల్లో బీఆర్ఎస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి చెందిన 22 మంది ఎమ్మెల్యేలపై సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు పడింది. కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పార్టీ ఎమ్మెల్యేలందరినీ ప్రస్తుత సమావేశాలు ముగిసే వరకు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.



## మహిళా ఎమ్మెల్యేలను తోసింది సొంత నేతలే!

3

- వీడియోలు విడుదల చేసిన మంత్రి సీతక్క
- గంగుల, సుధీర్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు
- సబిత, సునీత, కోవ లక్ష్మిని నెట్టేశారని వ్యాఖ్య

## కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతలపై కేసు

2

- మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో నమోదు
- అసెంబ్లీ గేటు వద్ద ఘటనపై పోలీసుల చర్య
- సీసీటీవీ, వీడియోల పరిశీలనకు విజ్ఞప్తి
- సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో దర్యాప్తు



## రైల్వే విస్తరణకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- ఏడు రద్దీ కారిడార్లలో నాలుగు లైన్లు
- 11 వేల కోట్లతో మల్టీట్రాకింగ్ పనులు
- ఐదు రాష్ట్రాల్లోని 14 జిల్లాలకు ప్రయోజనం
- తెలుగు రాష్ట్రాలకూ భారీగా లబ్ధి

4



## మా ఆదేశాలనే ధిక్కరిస్తారా.. అంత ధైర్యం ఎలా వచ్చింది?

విద్యార్థికి నోటీసుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- చర్యలు వద్దని చెప్పినా ఎలా ఇచ్చారని ప్రశ్న
- మేజిస్ట్రేట్ తీరుపై ధర్మాసనం మండిపాటు
- జిల్లా అధికారుల నుంచి వివరణ కోరనున్న కోర్టు

నోటీసును వెనక్కి తీసుకున్నట్లు వెల్లడి

4





# ఆయుష్ విద్యార్థులకు 'డబుల్' ధమాకా!

**హౌస్ సర్జన్లకు రూ.29,792**

**పీజీలకు రూ.74,482 స్టైఫండ్**

**భారీ పెంపుతో ప్రభుత్వం జీవో**

**అల్లోపతి మెడికోలతో సమానంగా చెల్లింపులు**

**మంత్రి దామోదర్‌కు విద్యార్థుల కృతజ్ఞతలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** రాష్ట్రంలోని ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి (ఆయుష్) విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆయుష్ మెడికోల స్టైఫండ్‌ను అల్లోపతి వైద్య విద్యార్థులతో సమానంగా భారీగా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన వివరాల ప్రకారం హౌస్ సర్జన్లకు ఇప్పటివరకు నెలకు ఇస్తున్న రూ. 13,754 స్టైఫండ్‌ను రూ. 29,792 కు పెంచగా, పీజీ విద్యార్థుల స్టైఫండ్‌ను రూ. 34,385 నుంచి ఏకంగా రూ. 74,482కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలసిన ఆయుష్ విద్యార్థులు, యువ వైద్యులు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై తీవ్ర హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి విద్యార్థులకు పెంచిన స్టైఫండ్‌కు సంబంధించిన జీవో కాపీని స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి దామోదర్ రాజనర్సింహ వారికి శుభాకాంక్షలు తెలుపుతూ, సమాజంలో గుణాత్మక మార్పుకు విద్యే పునాది అని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం చదువుతో ఆగిపోకుండా ఆయుష్ వైద్య విధానాలపై శాస్త్రీయ పరిశోధనలు చేసి, కొత్త చికిత్సా పద్ధతులను ప్రపంచానికి పరిచయం చేయాలని పిలుపునిచ్చారు. గత రెండున్నరేళ్ల పాలనలో ఆయుష్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక విప్లవాత్మక చర్యలు తీసుకుందని మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 700 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లు, 138 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంతో పాటు సిద్దిపేట, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్ జిల్లాల్లో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రులను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. అలాగే కరీంనగర్‌లో రూ. 15 కోట్ల వ్యయంతో మరొక 50 పడకల ఆయుష్ ఆసుపత్రి నిర్మాణం వేగంగా సాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా తమ స్టైఫండ్ పెంచకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యను గుర్తించి ఊరట కలిగించిందని విద్యార్థులు ఈ సందర్భంగా ఆవేదనను, సంతోషాన్ని పంచుకున్నారు. తమ విజ్ఞప్తిని ఆలకించి స్టైఫండ్ రెట్టింపు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆయుష్ విద్యార్థులు, డాక్టర్ల సంఘాల ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఎరువుల పంపిణీ యాప్‌ను రద్దు చేయం

**ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసమే యాప్**

**రైతాంగ విస్తృత ప్రయోజనాలకై కొనసాగింపు**

**సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నాం..**

**శాసనమండలిలో మంత్రి తుమ్మల సమాధానం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** యూరియా, ఇతర సబ్సిడీ ఎరువులు నిజమైన రైతులకు పారదర్శకంగా అందాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తే లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమగ్రంగా సమాధానమిచ్చారు. సాంకేతిక సమస్యల కారణంగా రైతులకు ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, సిగ్నల్స్ లేని ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్లు లేని రైతుల కోసం కామన్ సర్వీస్ సెంటర్లు, మీ-సేవ కేంద్రాలు, రిటైల్ పాయింట్ల వద్ద వాలంటీర్ల ద్వారా ప్రత్యామ్నాయ బుకింగ్ సౌకర్యాలు కల్పించామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఈ డిజిటల్ విధానాన్ని ఆదర్శంగా తీసుకునే కేంద్ర ప్రభుత్వం 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్'ను దేశవ్యాప్తంగా తెచ్చిందని, దానినే రాష్ట్రంలో సెప్టెంబర్ 2 నుంచి అమలు చేస్తున్నామని చెప్పారు. గతంలో కేటాయించిన యూరియా పక్కదారి పట్టడం, బ్లాక్ మార్కెటింగ్ జరగడం వంటి అక్రమాలకు చెక్ పెట్టడానికే ఈ మార్పు తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని, అంతర్జాతీయ పరిస్థితుల వల్ల దిగుమతుల్లో ఆలస్యమైనా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిల్వలను 23 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచామని చెప్పారు. కౌలు రైతులకు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎరువులు అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు.

# కుట్రధారులెవరైనా వదిలిపెట్టం!

మొదటి పేజీ తరువాయి

ఉసిగొల్పబడిన కొందరు వ్యక్తులు అధికారులపై దాడులకు పాల్పడటంతో పాటు సభాపతి స్థానాన్ని అవమానించేలా వ్యవహరించారని సీఎం ఆరోపించారు. స్పీకర్ తల్లిని సైతం అవమానించేలా వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఇది యాదృచ్ఛికంగా జరిగిన ఘటన కాదని, ఒక పథకం ప్రకారం దురుద్దేశంతో జరిగిన చర్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు. సభాపతి స్థానాన్ని అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలను దేశంపై జరిగిన ఉగ్రదాడులతో పోలుస్తూ సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన సభాపతి స్థానంపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని ఉపేక్షించలేమన్నారు.

**'తల్లిని అవమానించడం దారుణం'**

మన సమాజంలో మహిళకు అత్యున్నత స్థానం ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శక్తికి ప్రతీకగా అపరకాళి, భద్రకాళి అని.. దేశాన్ని భారతమాతగా, రాష్ట్రాన్ని తెలంగాణ తల్లిగా గౌరవించుకుంటామని చెప్పారు. అలాంటి తెలంగాణ గడ్డపై ఒక తల్లిని అవమానించేలా వ్యవహరించడం దారుణమన్నారు. సభాపతికి జరిగిన అవమానాన్ని ఒక వ్యక్తికి జరిగిన అవమానంగా మాత్రమే చూడలేమని, అది సమాజాన్ని అవమానించడమేనని వ్యాఖ్యానించారు. దోషులను తెలంగాణ సమాజం ఉపేక్షించదన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపేందుకు అనేక మార్గాలు ఉన్నాయని, కానీ వ్యక్తిగతంగా మనసును గాయపరిచే వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు.

**'ప్రజా సమస్యల చర్చను అడ్డుకున్నారు'**

సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభమైన శాసనసభ సమావేశాల్లో ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించాలని ప్రభుత్వం భావించిందని సీఎం తెలిపారు. విద్యారంగ సమస్యలు, ధరణిలో జరిగినట్లు ప్రభుత్వం ఆరోపిస్తున్న అక్రమాలు, 22--ఏ భూముల సమస్యలతో పాటు ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అయితే ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డుకునే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. సభను సజావుగా నిర్వహించేందుకు సభ్యులందరూ సహకరించాలని



కోరారు. "సభాపతి స్థానాన్ని అవమానించిన ఘటనతో పాటు సమావేశాల సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలన్నింటిపైనా సమగ్ర విచారణ జరుగుతుంది. కుట్ర చేసినవారు, ఉసిగొల్పినవారు, అమలు చేసినవారు ఎవరైనా చట్టం ముందు బాధ్యత వహించాల్సిందే" అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# దళితులు నడిచిన నేలను శుద్ధి చేస్తారా?

**ఎర్రవల్లి ఘటనపై సీఎం రేవంత్ ఆగ్రహం**

**డప్పులతో నిరసన తెలపడం ప్రజాస్వామ్య హక్కు**

**శుద్ధీకరణ అమానవీయమని మండిపాటు**

**ఫామ్‌హౌస్ వేదికగా కుట్రలు రచించారని ఆరోపణ**

**ప్రజాస్వామ్య వ్యవస్థనే అవమానించారన్న సీఎం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు జరిగిన అవమానంపై డప్పుల చప్పుళ్లతో ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన దళితుల పట్ల అవమానకరంగా వ్యవహరించడం అమానవీయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ సమీపంలో దళితులు నడిచిన ప్రదేశాన్ని బీఆర్ఎస్ నేతలు 'శుద్ధీకరణ' చేయడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. స్పీకర్‌కు జరిగిన అవమానాన్ని నిరసిస్తూ దళితులు డప్పులతో తమ ఆవేదనను వ్యక్తం చేసేందుకు ప్రయత్నించారని సీఎం పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, అలాంటి వారిని అవమానించేలా వ్యవహరించడం సమర్థనీయం కాదన్నారు. వారు నడిచిన ప్రదేశాన్ని శుద్ధీకరించారన్న ఘటనను తీవ్రంగా తప్పుబట్టారు. శాసనసభ కార్యకలాపాలను అడ్డుకోవాలనే దురుద్దేశంతో ఫామ్‌హౌస్‌ను వేదికగా చేసుకుని కుట్రలు రచించారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఉసిగొల్పబడిన కొందరు వ్యక్తులు సభాపతి స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించేలా వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఈ పరిణామాలు యాదృచ్ఛికంగా జరిగినవి కావని, ఒక పథకం ప్రకారమే చోటుచేసుకున్నాయని సీఎం ఆరోపించారు. సభాపతి స్థానాన్ని కించపరిచేలా వ్యవహరించడం ఒక వ్యక్తిని అవమానించడం కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థనే అవమానించడమని పేర్కొన్నారు. "దళితులు నడిచిన ప్రదేశాన్ని శుద్ధీకరించడమంటే వారి ఆత్మగౌరవాన్ని కించపరచడమే. ఇలాంటి వివక్షాపూరిత చర్యలకు తెలంగాణ సమాజంలో చోటుండకూడదు" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



# బీఆర్ఎస్‌కు బిగ్ షాక్!

**శాసనసభ నుంచి కేటీఆర్, హరీశ్ సహా 22 మంది సస్పెండ్**

**సెషన్ మొత్తానికి సభ నుంచి వేటు**

**శ్రీధర్‌బాబు తీర్మానానికి స్పీకర్ ఆమోదం**

**నినాదాలతో సభకు ఆటంకమంటూ చర్య**

**స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లగా అడ్డుకున్న మార్షల్స్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** శాసనసభ వర్షాకాల సమావేశాల్లో బీఆర్ఎస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి చెందిన 22 మంది ఎమ్మెల్యేలపై సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు పడింది. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పార్టీ ఎమ్మెల్యేలందరినీ ప్రస్తుత సమావేశాలు ముగిసే వరకు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు 'వి వాంట్ జస్టిస్' అంటూ పెద్దఎత్తున



నినాదాలు చేశారు. సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నారని పేర్కొంటూ వారిని సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి సభ ఆమోదం తెలపడంతో స్పీకర్ సస్పెన్షన్‌ను ప్రకటించారు.

**22 మందిపై ఒకేసారి వేటు**

కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవ లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందపై సస్పెన్షన్ వేటు పడింది. సస్పెన్షన్ అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నట్లు సమాచారం.

**'సభాపతిని అవమానించడం సరికాదు'**

బీఆర్ఎస్ సభ్యుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. సభాపతి సూచనలు చేసినప్పుడు వాదనలకు దిగకుండా సభ సజావుగా నడిచేందుకు సహకరించాలని కోరారు. వెల్‌లోకి వచ్చి సభాపతిని సవాల్ చేసేలా వ్యవహరించడం సరికాదన్నారు. సభాపతి ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. స్పీకర్‌తో పాటు ఆయన తల్లిని అవమానించేలా వ్యాఖ్యలు చేశారని, అందుకే దళిత సంఘాలు నిరసనకు దిగాయని భట్టి పేర్కొన్నారు.

**'దొరతనం పోకడలను భరించం'**

ఎర్రవల్లిలో దళిత సంఘాల నిరసన అనంతరం వారు నడిచిన రోడ్డును పసుపు నీళ్లతో 'శుద్ధి' చేశారన్న ఘటనపైనా భట్టి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది దళితులను అవమానించడమేనని ఆరోపించారు. "న్యాయం కావాల్సింది బలహీనవర్గాలకు.. దళిత, గిరిజనులకు. బీఆర్ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలి" అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేతల తీరును ప్రభుత్వం ఇప్పటివరకు సంయమనంతో భరిస్తోందని పేర్కొన్నారు. "దొరతనం పోకడలను భరించేందుకు తెలంగాణ సిద్ధంగా లేదు. సభాపతి స్థానాన్ని గౌరవిస్తూ ప్రజా సమస్యలపై చర్చించాలి" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతలపై కేసు

**మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో నమోదు**

**విధులకు ఆటంకం.. దుర్భాషలాడారని ఆరోపణ**

**అసెంబ్లీ గేటు వద్ద ఘటనపై పోలీసుల చర్య**

**సీసీటీవీ, వీడియోల పరిశీలనకు విజ్ఞప్తి**

**సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో దర్యాప్తు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** అసెంబ్లీ వద్ద మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దుర్భాషలాడి, బెదిరించారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో సహా పలువురు ఆ పార్టీ నేతలపై సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అసెంబ్లీ గేట్ నంబర్--3 వద్ద సోమవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ విధులకు ఆటంకం కలిగించారని, దుర్భాషలాడడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారని మహిళా పోలీసు సిబ్బంది ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. మహిళా పోలీసులను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని, తమ సమక్షంలో కొందరు టీషర్టులు విప్పి నిరసన తెలపడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యామని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, వీడియోలు, ఫొటోలు, వైద్య రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది. తోపులాటలో మహిళా పోలీసులను నెట్టారని, అనంతరం కొందరు పోలీసు సిబ్బంది వైద్య చికిత్స పొందారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనతో తమకు మానసిక వేదన,



అవమానం కలిగిందని మహిళా పోలీసులు తెలిపినట్లు సమాచారం. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ముద్రించిన నల్ల టీషర్టులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని గేటు వద్ద అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. తమను సభలోకి ఎందుకు అనుమతించడం లేదని హరీశ్‌రావు పోలీసులను ప్రశ్నించగా, టీషర్టులపై ఉన్న నినాదాలకు అనుమతి లేదని, స్పీకర్ ఆదేశాల మేరకే అడ్డుకుంటున్నామని పోలీసులు చెప్పినట్లు సమాచారం. దీంతో హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలు అక్కడే టీషర్టులు తీసేసి నిరసన కొనసాగించారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ నేతలకు మధ్య తోపులాట మరింత పెరిగింది. ఈ ఘటనలో కేటీఆర్, హరీశ్‌రావు, సుధీర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి సహా పలువురిపై కేసు నమోదైనట్లు పోలీసులు పేర్కొన్నారు. మహిళా పోలీసుల పట్ల అనుచితంగా వ్యవహరించారన్న ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో తాజాగా కేసు నమోదు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే మహిళా పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు ప్రస్తుతం ఆరోపణల దశలోనే ఉన్నాయి. ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం దర్యాప్తులో పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# మా ఎమ్మెల్యేలపై దాడి.. మాపైనే కేసులా?

- గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు
- పోలీసుల తీరుపై ఆధారాలు ఇచ్చామన్న కేటీఆర్
- సబిత, సునీత ఘటనలను వివరించిన నేతలు
- హామీల అమల్లో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపణ
- రాష్ట్ర పరిస్థితులపై జోక్యం చేసుకోవాలని వినతి



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** అసెంబ్లీ వద్ద తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నేతలు గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాకు ఫిర్యాదు చేశారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించారని, దాడికి సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించినట్లు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. తమపై దాడులు జరిగాయని ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయకుండా.. తిరిగి తమపైనే కేసులు పెట్టారని ఆరోపించారు. లోక్‌భవన్‌లో గవర్నర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు కలిసి వినతిపత్రం సమర్పించారు. అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాలతో పాటు రాష్ట్రంలో శాంతిభద్రతలు, రైతులు, నిరుద్యోగుల సమస్యలు, ఎన్నికల హామీల అమలు తదితర అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనకు నిరసనగా నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించారని, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారని ఆరోపిస్తూ అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు చూపించినట్లు చెప్పారు. "శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు వివరించాం. మాపై దాడులు చేసి తిరిగి మాపైనే కేసులు పెట్టారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా మా ఫిర్యాదుపై కేసు నమోదు కాలేదు" అని కేటీఆర్ ఆరోపించారు. అయితే మహిళా ఎమ్మెల్యేలపై దాడి, చీర లాగారన్న అంశాలు బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు కాగా, వాటిపై అధికారిక విచారణలో వాస్తవాలు తేలాల్సి ఉంది. పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ నల్ల టీషర్టుతో నిరసన తెలిపినట్లుగానే తాము కూడా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు నిరసనగా నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్లామని కేటీఆర్ చెప్పారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు తమకూ ఉందన్నారు. ఎన్నికలకు ముందు వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, కానీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. 420కి పైగా హామీలను అమలు చేయకుండా గాలికొదిలేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు ద్వారా రూ.73 వేల కోట్లు రైతులకు అందించామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో అందించడంలోనూ విఫలమైందని విమర్శించారు. రైతుబీమాను నీరుగార్చడంతో పాటు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, తమ ఎమ్మెల్యేలపై జరిగినట్లు ఆరోపిస్తున్న పోలీసు దాడులు, రైతులు, నిరుద్యోగుల సమస్యలు, ప్రభుత్వ హామీల అమలుపై గవర్నర్‌కు సమగ్రంగా వివరించామని, ఈ అంశాల్లో జోక్యం చేసుకోవాలని కోరినట్లు కేటీఆర్ తెలిపారు.

# మహిళా ఎమ్మెల్యేలను తోసింది సొంత నేతలే!

- వీడియోలు విడుదల చేసిన మంత్రి సీతక్క
- గంగుల, సుధీర్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు
- సబిత, సునీత, కోవ లక్ష్మిని నెట్టేశారని వ్యాఖ్య
- పోలీసులపై బీఆర్ఎస్ ఆరోపణలకు కౌంటర్
- వీడియోలు మార్ఫింగ్ అంటూ బీఆర్ఎస్ ఖండన



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణల వివాదం మరో మలుపు తిరిగింది. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిని పోలీసులు కాదని.. వారి సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే వెనుక నుంచి నెట్టేశారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించినవిగా పేర్కొంటూ కొన్ని వీడియోలు, ఫొటోలను ఆమె మీడియాకు విడుదల చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్‌రెడ్డి తమ పార్టీ మహిళా సభ్యులను వెనుక నుంచి నెట్టారని సీతక్క ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలను పక్కకు తోసుకుంటూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష సభ్యులు ఈ విధంగా వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. గత సోమవారం నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు గేటు వద్ద అడ్డుకున్న సమయంలో తోపులాట చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితర మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై గవర్నర్‌కు సైతం ఫిర్యాదు చేసి, ఆధారాలు సమర్పించినట్లు కేటీఆర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే సీతక్క విడుదల చేసిన వీడియోలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. మహిళా ఎమ్మెల్యేలకు జరిగినట్లు చెబుతున్న ఘటనలకు పోలీసులు కారణం కాదని, బీఆర్ఎస్ నేతల తోపులాటలోనే వారు ఇబ్బందులకు గురయ్యారని సీతక్క వాదించారు. మరోవైపు అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలో గాయపడినట్లు చెబుతున్న మహిళా పోలీసు సిబ్బందిని సీతక్క పరామర్శించారు. విధులకు ఆటంకం కలిగించడం, దుర్భాషలాడటం, బెదిరించడం తదితర ఆరోపణలపై కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. కొంతమంది బీఆర్ఎస్ నేతలు తమ ఎదుట టీషర్టులు విప్పి నిరసనకు దిగారని, తోపులాటలో ఇబ్బందులకు గురిచేశారని మహిళా కానిస్టేబుల్ తన ఫిర్యాదులో ఆరోపించారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం సహించబోదని సీతక్క స్పష్టం చేశారు. అయితే సీతక్క విడుదల చేసిన వీడియోలు, ఫొటోలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వాటిని మార్ఫింగ్ చేశారని, కృత్రిమ మేధతో రూపొందించిన దృశ్యాలని ఆరోపిస్తూ మంత్రి వాదనను కొట్టిపారేశారు. దీంతో అసెంబ్లీ గేటు వద్ద మహిళా ఎమ్మెల్యేలను ఎవరు నెట్టారన్న అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పరస్పర విరుద్ధ వాదనలు వినిపిస్తున్నాయి. వీడియోల ప్రామాణికత, ఘటనలో ఎవరి పాత్ర ఏమిటన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.

# ఈ-20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదు

- అసెంబ్లీలో మంత్రి పొన్నం స్పష్టీకరణ
- ఇప్పటివరకు ఒక్క ఫిర్యాదూ రాలేదని వెల్లడి
- ప్రత్యేక మార్గదర్శకాల అవసరం లేదన్న ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన తెలంగాణ
- వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో నిజం లేదని వ్యాఖ్య



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** ఇథనాల్ కలిపిన ఈ-20 పెట్రోల్ వినియోగంతో వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ ఇంధనం కారణంగా వాహనాలకు నష్టం వాటిల్లినట్లు ఇప్పటివరకు రాష్ట్ర రవాణాశాఖకు ఎలాంటి నిర్దిష్ట ఫిర్యాదులు అందలేదని శాసనసభలో వెల్లడించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేస్తున్న అభిప్రాయంతో రాష్ట్ర ప్రభుత్వం ఏకీభవిస్తున్నట్లు తెలిపారు. ఈ-20 పెట్రోల్ కారణంగా వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ తమ దృష్టికి సమాచారం రాలేదని మంత్రి చెప్పారు. ప్రస్తుతం తమ వద్ద ఎలాంటి ప్రతికూల నివేదికలు లేనందున ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేయడం లేదా నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి లేదని వివరించారు. ఈ-20 ఇంధనం విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే తెలంగాణ ప్రభుత్వం ఏకీభవిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి లోక్‌సభలో ఇచ్చిన సమాధానాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, మూడు కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ మిశ్రమ ఇంధనాన్ని వినియోగిస్తున్నాయని, ఇంజిన్ వైఫల్యాలకు సంబంధించి నిర్దిష్ట ఫిర్యాదులు అందలేదని కేంద్రం పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ-20 ఇంధనంలోని తేమ, క్లోరైడ్ స్థాయిల కారణంగా కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందంటూ భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం గతంలో కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసినట్లు పేర్కొన్నారు. అయితే దీనిపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ అనంతరం ఆ లేఖను ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ-20 పెట్రోల్ వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని చెప్పేందుకు ప్రస్తుతం తమ వద్ద ఆధారాలు లేదా ఫిర్యాదులు లేవని, అందువల్ల ప్రత్యేక నియంత్రణ చర్యల అవసరం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభలో స్పష్టం చేశారు.



# బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

## ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..

## తెలంగాణలో అధికారంలోకి వస్తాం

## కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. "నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి. పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు. దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# బీఆర్ఎస్ చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు

## లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన పలువురు మంత్రులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌కుమార్ శుక్లాను పలువురు మంత్రులు కలిశారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ తొలిరోజు లోపలికి ప్రవేశించే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు... స్పీకర్‌ను అవమానపర్చేవిధంగా మాట్లాడిన తీరును మంత్రులు గవర్నర్‌కు వివరించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ దొర అహంకారంతో వ్యవహరిస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. శాసనసభ స్పీకర్, అతని తల్లిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు దూషించారని... దీన్ని నిరసిస్తూ కేసీఆర్ ఫామ్ హౌజ్ దగ్గర డప్పులతో దళితులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం కేసీఆర్ దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ఈ రెండు ఘటనలపై డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో పలువురు మంత్రులు... గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. దళితులు ప్రజాస్వామ్యంగా నిరసన తెలిపితే కేసీఆర్ అవమానించారు,

# ఆ బూతులు భరించలేకనే కడుపుమండి మాట్లాడా!

## కేసీఆర్‌పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ దుమారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి చావును కోరుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఆయన అంగీకరించారు. అయితే, సభలోనూ బయటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, మహిళా మంత్రులను బీఆర్ఎస్ నేతలు అత్యంత అసభ్యకరంగా, కులాల పేరుతో దూషిస్తూ లక్ష్మణరేఖ దాటుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతల బూతులు వినలేక టీవీలు చూస్తున్న మహిళలు చెవులు మూసుకుంటున్నారని, బీఆర్ఎస్ నేతలు వారి సొంత కుటుంబ సభ్యులు కూడా తలదించుకునేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే అసెంబ్లీకి రాకుండా దూరంగా ఉంటున్న కేసీఆర్ వెంటనే సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చలో పాల్గొనాలని కోరే క్రమంలో కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సొంతం కాదని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిని కూడా ఎమ్మెల్యే శంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఉద్దేశించి, "ఎక్కడ సచ్చిండు రాహుల్ గాంధీ?" అంటూ మూడు రోజుల క్రితం కరీంనగర్ పర్యటనలో కేటీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను ఆయన మీడియా సమక్షంలో ప్రదర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలపై అంతటి దిగజారుడు పదజాలాన్ని ఉపయోగించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

## సంపాదకీయం



# వరుస వివాదాలు

## బీఆర్ఎస్‌కు బలమా? బలహీనతా?

**అరెస్టులు.. సస్పెన్షన్లతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త వేడి**

**'ప్రభుత్వ నిర్బంధం'గా మలిస్తే గులాబీ పార్టీకి సానుభూతి**

**హద్దు దాటిన వ్యాఖ్యల ముద్ర పడితే రాజకీయంగా ఎదురుదెబ్బ**

తెలంగాణ రాజకీయాల్లో కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు సభలో వాదోపవాదాల స్థాయిని దాటి అసెంబ్లీ గేట్లు, పోలీస్‌స్టేషన్లు, కోర్టులు, సస్పెన్షన్ల వరకు చేరింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, ఎన్.నవీన్‌కుమార్‌రెడ్డిల సస్పెన్షన్, అరెస్టులు, స్పీకర్‌పై వ్యాఖ్యల వివాదం, మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల ప్రవర్తనకు సంబంధించిన ఆరోపణలు.. అన్నీ కలిపి తెలంగాణ రాజకీయాలను వేడెక్కించాయి. అయితే ఈ పరిణామాలన్నీ బీఆర్ఎస్‌కు రాజకీయంగా లాభమా? నష్టమా? అనే ప్రశ్న ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. దీనికి ఒకే మాటలో సమాధానం చెప్పడం కష్టం. ఎందుకంటే ఇదే ఘటనలు ఒక కోణంలో బీఆర్ఎస్‌కు సానుభూతిని తెచ్చిపెట్టే అవకాశముంటే.. మరో కోణంలో పార్టీపై ప్రతికూల అభిప్రాయాన్ని కూడా పెంచే ప్రమాదం ఉంది. ప్రతిపక్ష రాజకీయాల్లో అరెస్టులు, నిర్బంధాలు కొత్తేమీ కాదు. అధికారంలో ఉన్న పార్టీ తమ గొంతు నొక్కుతోందని ప్రజలను నమ్మించగలిగితే అవే పరిణామాలు ప్రతిపక్షానికి రాజకీయ పెట్టుబడిగా మారిన సందర్భాలు దేశ రాజకీయాల్లో ఉన్నాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ కూడా అదే వాదనను ముందుకు తెస్తోంది. తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే పోలీసులను ఉపయోగించి అణచివేస్తున్నారని ఆరోపిస్తోంది. ఎమ్మెల్సీల అరెస్టులు, అనంతరం కోర్టు రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించడం వంటి పరిణామాలను తన వాదనకు అనుకూలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆ పార్టీ ప్రయత్నించే అవకాశం ఉంది. ముఖ్యంగా అసెంబ్లీ గేటు వద్ద మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు దురుసుగా వ్యవహరించారన్న బీఆర్ఎస్ ఆరోపణలు ప్రజల్లోకి బలంగా వెళ్తే ప్రభుత్వమే రాజకీయంగా సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి రావచ్చు. ఈ ఆరోపణలను ప్రభుత్వం ఖండించినా.. అసలు ఏం జరిగిందన్నది పారదర్శక విచారణతో తేల్చడం అవసరం.

**కానీ.. 'హద్దు దాటారు' అనే ముద్ర పడితే?**

బీఆర్ఎస్‌కు అసలు ప్రమాదం ఇక్కడే ఉంది. ప్రతిపక్షం ఎంత దూకుడుగా పోరాడినా ప్రజాస్వామ్య వ్యవస్థల్లో కొన్ని హద్దులు ఉంటాయి. సభాధ్యక్షుడిని, ఆయన కుటుంబ సభ్యులను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారనే అభిప్రాయం ప్రజల్లో బలపడితే బీఆర్ఎస్‌కు సానుభూతి కంటే వ్యతిరేకతే ఎక్కువయ్యే ప్రమాదం ఉంటుంది. తాతా మధు తన వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించినవి కావని వివరణ ఇచ్చారు. ఒకవేళ తన వ్యాఖ్యలను స్పీకర్ అలా భావిస్తే వెనక్కి తీసుకుంటానని కూడా పేర్కొన్నారు. అయినప్పటికీ వివాదం అక్కడితో ముగియలేదు. ఇద్దరు ఎమ్మెల్సీల సస్పెన్షన్ వరకు వెళ్లింది. ఇలాంటి సమయంలో బీఆర్ఎస్ తన రాజకీయ పోరాటానికి, వ్యక్తిగత వ్యాఖ్యలకు మధ్య స్పష్టమైన గీత గీయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాన్ని ఎంత తీవ్రంగా విమర్శించినా వ్యక్తిగత దూషణలుగా భావించే మాటలు మొత్తం రాజకీయ అంశాన్నే పక్కదారి పట్టిస్తాయి. అప్పుడు ప్రజలు చర్చించాల్సిన ప్రభుత్వ వైఫల్యాల స్థానంలో 'ఎవరు ఎవరిని ఏమన్నారు?' అన్నదే ప్రధాన చర్చగా మారుతుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్న అధికారపక్ష డిమాండ్ కూడా రాజకీయంగా ఆసక్తికరమైనదే. ఇద్దరు ఎమ్మెల్సీల వ్యాఖ్యల బాధ్యతను నేరుగా పార్టీ అధినేతకు ముడిపెట్టడం ద్వారా వివాదాన్ని కేసీఆర్ వరకు తీసుకెళ్లే ప్రయత్నం కనిపిస్తోంది. కాంగ్రెస్‌కు ఇందులో రాజకీయ ప్రయోజనం లేకపోలేదు. బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలను పార్టీ సంస్కృతిగా చిత్రీకరించగలిగితే ప్రతిపక్షంపై నైతిక ఒత్తిడి పెంచవచ్చు. మరోవైపు బీఆర్ఎస్ మాత్రం వ్యక్తుల వ్యాఖ్యల పేరుతో పార్టీ అధినేతను లక్ష్యంగా చేసుకోవడం రాజకీయ కక్షసాధింపేనని ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చు. ఇద్దరు ఎమ్మెల్సీల సభ్యత్వాలనే రద్దు చేయాలన్న డిమాండ్లు అధికారపక్షం నుంచి మరింత తీవ్రమైతే రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉంది. సభా గౌరవాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు అవసరమన్న వాదన ఒకవైపు ఉంటుంది. అదే సమయంలో శిక్ష తప్పుకు తగిన స్థాయిలోనే ఉండాలన్న ప్రజాస్వామ్య సూత్రం కూడా ముఖ్యమే.

**కాంగ్రెస్‌కూ సంయమనమే శ్రేయస్కరం**

ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ మాత్రమే ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం లేదు. అధికారపక్షానికీ అంతే బాధ్యత ఉంది. ప్రతిపక్ష నేతలు హద్దులు దాటితే చట్టం, సభా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. కానీ ప్రతి రాజకీయ నిరసనకూ పోలీసు చర్యే సమాధానమన్న అభిప్రాయం ఏర్పడితే అది ప్రభుత్వానికే నష్టం చేస్తుంది. ప్రతిపక్షానికి నిరసన తెలిపే ప్రజాస్వామ్య అవకాశం ఉండాలి. అదే సమయంలో సభా గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిపక్షానికీ ఉంటుంది. ఈ రెండు సూత్రాల్లో ఏ ఒక్కటి దెబ్బతిన్నా ప్రజాస్వామ్యమే బలహీనపడుతుంది.

**మరి.. బీఆర్ఎస్‌కు పాజిటివా? నెగెటివా?**

ప్రస్తుతానికి చూస్తే బీఆర్ఎస్‌కు ఇది 'పూర్తి పాజిటివ్' కాదు.. 'పూర్తి నెగెటివ్' కూడా కాదు. ఈ పరిణామాలను ఆ పార్టీ ఇకపై ఎలా మలుచుకుంటుందన్నదే ఫలితాన్ని నిర్ణయిస్తుంది. అరెస్టులు, సస్పెన్షన్లను మాత్రమే చూపిస్తూ సానుభూతి కోరితే దాని ప్రభావం పరిమితమే కావచ్చు. మహిళా ఎమ్మెల్యేల ఘటనపై వాస్తవాలను ఆధారాలతో ప్రజల ముందుంచి, అదే సమయంలో వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉంటూ ప్రభుత్వ హామీలు, రైతులు, నిరుద్యోగులు, మహిళలు, సంక్షేమం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి ప్రజా సమస్యలపై పోరాటాన్ని నిర్మిస్తే ఈ పరిణామాలు బీఆర్ఎస్‌కు రాజకీయంగా ఉపయోగపడే అవకాశం ఉంది. అదే దూకుడు పేరుతో వ్యక్తిగత వ్యాఖ్యలు, సభా మర్యాదలను దాటే ప్రవర్తన కొనసాగితే అధికారపక్షం కోరుకుంటున్నట్లుగానే అసలు సమస్యల నుంచి చర్చ పక్కదారి పడుతుంది. అప్పుడు లాభం కంటే నష్టమే ఎక్కువ కావచ్చు. పోరాటం ఎంత దూకుడుగా సాగిందన్నది కాదు.. దేనికోసం సాగిందన్నదే ప్రజలు చివరకు గుర్తుంచుకుంటారు. అధికారానికి సంయమనం ఎంత అవసరమో.. ప్రతిపక్షానికి బాధ్యత అంతే అవసరం. ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు బీఆర్ఎస్‌కు అవకాశాన్నీ ఇచ్చాయి.. హెచ్చరికనూ చేశాయి. ఆ అవకాశాన్ని ప్రజా ఎజెండాగా మార్చుకుంటుందా? వివాదాల ఊబిలోనే చిక్కుకుంటుందా? అన్నదే గులాబీ పార్టీ ముందున్న అసలు పరీక్ష.

# రైల్వే విస్తరణకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- ఏడు రద్దీ కారిడార్లలో నాలుగు లైన్లు
- 11 వేల కోట్లతో మల్టీట్రాకింగ్ పనులు
- ఐదు రాష్ట్రాల్లోని 14 జిల్లాలకు ప్రయోజనం
- ఏటా 27 మిలియన్ టన్నుల సరకు సామర్థ్యం పెంపు
- తెలుగు రాష్ట్రాలకూ భారీగా లబ్ధి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** దేశంలో రైల్వే మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అత్యంత రద్దీగా ఉండే ఏడు ప్రధాన రైల్వే కారిడార్లలో నాలుగు లైన్ల వ్యవస్థను విస్తరించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. సుమారు రూ.11 వేల కోట్ల విలువైన మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కేంద్రం నిర్ణయంతో ఢిల్లీ-హౌరా, హౌరా-ముంబై, ఢిల్లీ-ముంబై, ఢిల్లీ-గువాహటి, ఢిల్లీ-చెన్నై, హౌరా-చెన్నై, ముంబై-చెన్నై కారిడార్లలో రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచనున్నారు. అత్యంత రద్దీగా ఉండే ఈ మార్గాల్లో అదనపు లైన్లు అందుబాటులోకి రావడంతో రైళ్ల రాకపోకల్లో ఆటంకాలు తగ్గడంతో పాటు మరిన్ని ప్రయాణికుల, సరకు రైళ్లను నడిపేందుకు అవకాశం ఏర్పడనుంది.



**4,790 గ్రామాలకు ప్రయోజనం**

ఈ ప్రాజెక్టులతో ఐదు రాష్ట్రాల్లోని 14 జిల్లాలకు ప్రయోజనం చేకూరనుంది. దాదాపు 4,790 గ్రామాల్లో రైలు కనెక్టివిటీ, రవాణా సామర్థ్యం మెరుగుపడనుండగా సుమారు 56 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం కలుగుతుందని అంచనా. ఢిల్లీ-హౌరా మార్గంలో కాన్పూర్, ప్రయాగ్‌రాజ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్, పాట్నా, ఆసన్‌సోల్ వంటి కీలక ప్రాంతాలు ఉన్నాయి. ఢిల్లీ-ముంబై మార్గం మథుర, కోటా, రత్లాం, వడోదర, సూరత్‌లను కలుపుతుంది. ఢిల్లీ-చెన్నై మార్గంలో ఆగ్రా, గ్వాలియర్, ఝాన్సీ, భోపాల్, నాగ్‌పూర్, విజయవాడ వంటి ప్రధాన నగరాలు ఉన్నాయి. ముంబై-చెన్నై కారిడార్ పుణె సహా పలు కీలక ప్రాంతాలను అనుసంధానిస్తోంది.

**సరకు రవాణాకు మరింత ఊపు**

ఈ కారిడార్లు బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు తదితర కీలక సరకు రవాణాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. మల్టీట్రాకింగ్ పనులు పూర్తయితే ఏటా అదనంగా సుమారు 27 మిలియన్ టన్నుల సరకు రవాణా సామర్థ్యం పెరుగుతుందని అంచనా. రద్దీ తగ్గడంతో ప్రయాణికుల రైళ్ల వేగం, సమయపాలన మెరుగుపడేందుకు కూడా అవకాశం ఏర్పడనుంది. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రైల్వేల ఆధునికీకరణ, మౌలిక వసతుల విస్తరణకు నిరంతరం ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రద్దీ అధికంగా ఉన్న ప్రధాన కారిడార్ల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు భవిష్యత్ రవాణా అవసరాలకు అనుగుణంగా మరిన్ని మార్గాల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.

**తెలుగు రాష్ట్రాలకు లబ్ధి**

కేంద్ర నిర్ణయంతో తెలుగు రాష్ట్రాల్లోనూ రైల్వే మౌలిక వసతుల విస్తరణకు మార్గం సుగమం కానుంది. హౌరా-చెన్నై కారిడార్‌లో భాగంగా విశాఖపట్నం, విజయవాడ మీదుగా నాలుగు లైన్ల విస్తరణ జరగనుంది. ముంబై-చెన్నై కారిడార్‌లో గుంతకల్లు, రేణిగుంట మీదుగా నాలుగు లైన్ల సామర్థ్యం అందుబాటులోకి రానుంది. తెలంగాణలో ఘట్‌కేసర్-కాజీపేట మధ్య సుమారు 110 కిలోమీటర్ల మేర రూ.2,418 కోట్లతో నాలుగో లైన్ నిర్మించనున్నారు. మరోవైపు అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో మూడు, నాలుగో లైన్ల నిర్మాణానికి కూడా ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. కొత్త లైన్ల నిర్మాణంతో రద్దీ తగ్గడం, రైళ్ల సంఖ్య పెరగడం, సరకు రవాణా సామర్థ్యం మెరుగుపడటంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని కీలక రైల్వే మార్గాలకు మరింత ఊపు లభించనుంది.

# ఉగ్ర కేసు ఎత్తివేయలేదు.. దర్యాప్తు కొనసాగుతోంది

**ఏడుగురు విదేశీయులపై ఎన్ఐఏ స్పష్టత**

**యూఏపీఏ కోణంలో విచారణ**

**ప్రస్తుత ఛార్జ్‌షీట్‌లో విదేశీయుల చట్టం సెక్షన్లే**

**ఆధారాలు లభిస్తే అనుబంధ ఛార్జ్‌షీట్**

**ఉగ్ర ఆరోపణలు తొలగించారన్న ప్రచారానికి తెర**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** అమెరికా దేశస్థుడు మాథ్యూ ఆరోన్ వాన్‌డైక్ సహా ఏడుగురు విదేశీయులపై ఉగ్రవాద ఆరోపణలను పూర్తిగా ఉపసంహరించుకోలేదని జాతీయ దర్యాప్తు సంస్థ వర్గాలు స్పష్టం చేశాయి. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద నమోదైన అంశాలపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని పేర్కొన్నాయి. ప్రస్తుత ఛార్జ్‌షీట్‌లో ఆ చట్టంలోని సెక్షన్లు లేకపోవడాన్ని ఉగ్రవాద కోణంలో దర్యాప్తు ముగిసినట్లుగా భావించరాదని తెలిపాయి. భారత్‌లోని సాయుధ గ్రూపులతో సంబంధాలు, ఉగ్ర కుట్రకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో వాన్‌డైక్‌తో పాటు మరో ఆరుగురు విదేశీయులను ఎన్ఐఏ అరెస్టు చేసింది. దర్యాప్తులో ఇప్పటివరకు దేశంలోకి అక్రమంగా ప్రవేశించడం, అనుమతులు లేకుండా నివసించడం, సంచరించడం వంటి నేరాలకు సంబంధించిన ఆధారాలు లభించినట్లు దర్యాప్తు సంస్థ వర్గాలు తెలిపాయి. ఈ కేసులో ఏడుగురు నిందితులపై ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారెనర్స్ చట్టంలోని సెక్షన్లు 21, 23 కింద ఎన్ఐఏ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే అందులో యూఏపీఏ సెక్షన్లను ప్రస్తావించకపోవడంతో నిందితులపై ఉగ్రవాద ఆరోపణలను ఎన్ఐఏ ఎత్తివేసిందన్న ప్రచారం జరిగింది. దీనిపై ఎన్ఐఏ వర్గాలు స్పందిస్తూ.. ఇప్పటివరకు దర్యాప్తులో స్పష్టమైన ఆధారాలు లభించిన నేరాలకు సంబంధించి మాత్రమే ప్రస్తుత ఛార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు తెలిపాయి. ఉగ్రవాద సంబంధాలు, కుట్ర ఆరోపణలపై విచారణ మాత్రం కొనసాగుతోందని స్పష్టం చేశాయి. యూఏపీఏ కింద నేరాన్ని నిర్ధారించే ఆధారాలు తదుపరి దర్యాప్తులో వెలుగులోకి వస్తే అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేసే అవకాశం ఉందని ఎన్ఐఏ వర్గాలు పేర్కొన్నాయి. అందులో సంబంధిత యూఏపీఏ సెక్షన్లను చేర్చే అవకాశం ఉంటుందని తెలిపాయి. ప్రస్తుత ఛార్జ్‌షీట్‌లో యూఏపీఏ సెక్షన్లు లేకపోవడం వల్ల ఉగ్రవాద ఆరోపణలు పూర్తిగా తొలగిపోయినట్లు కాదని, ఆ కోణంలో దర్యాప్తు

# మా ఆదేశాలనే ధిక్కరిస్తారా.. అంత ధైర్యం ఎలా వచ్చింది?

**విద్యార్థికి నోటీసుపై సుప్రీంకోర్టు ఆగ్రహం**

**చర్యలు వద్దని చెప్పినా ఎలా ఇచ్చారని ప్రశ్న**

**మేజిస్ట్రేట్ తీరుపై ధర్మాసనం మండిపాటు**

**జిల్లా అధికారుల నుంచి వివరణ కోరనున్న కోర్టు**

**నోటీసును వెనక్కి తీసుకున్నట్లు వెల్లడి**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** "విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అయినా ఓ విద్యార్థికి నోటీసు జారీ చేసేంత ధైర్యం మేజిస్ట్రేట్‌కు ఎలా వచ్చింది?" అంటూ సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జులైలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనల్లో పాల్గొన్నారన్న ఆరోపణలతో గ్రేటర్ నోయిడాకు చెందిన ఓ విద్యార్థికి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీ చేయడాన్ని తప్పుబట్టింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ వ్యవహారంపై స్పందిస్తూ.. తమ స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ విద్యార్థిపై చర్యలకు ఎలా ఉపక్రమించారని ప్రశ్నించింది. గౌతమ్‌బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్, సంబంధిత ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నుంచి వివరణ కోరనున్నట్లు తెలిపింది. జులైలో జరిగిన సీజేపీ ఆందోళనలకు సంబంధించి విద్యార్థులపై నమోదైన కేసులన్నింటినీ కొట్టివేయాలని సుప్రీంకోర్టు ఈ నెల 1న ఆదేశించినట్లు సమాచారం. జులై 20 నుంచి 25 మధ్య దేశవ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొనసాగించరాదని, వాటిని ముగిసిన కేసులుగా పరిగణించాలని స్పష్టం చేసింది. అదే ఆందోళనలకు సంబంధించి భవిష్యత్తులోనూ విద్యార్థులపై కొత్తగా బలవంతపు చర్యలు తీసుకోవద్దని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే గ్రేటర్ నోయిడాకు చెందిన విద్యార్థికి మేజిస్ట్రేట్ నోటీసు జారీ చేసిన విషయాన్ని సీనియర్ న్యాయవాది బిశ్వజిత్ భట్టాచార్య సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ధర్మాసనం జోక్యం చేసుకోవాలని కోరారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. "ఓ విద్యార్థికి మేజిస్ట్రేట్ నోటీసు ఎలా జారీ చేస్తారు? విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అయినా ఇలా చేయడానికి మేజిస్ట్రేట్‌కు ఎంత ధైర్యం?" అంటూ ప్రశ్నించింది. గౌతమ్‌బుద్ధ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థికి ఈ నెల 4న నోటీసు జారీ చేసినట్లు కోర్టు దృష్టికి వచ్చింది. ప్రభుత్వ వ్యతిరేక సమాచారాన్ని ప్రచారం చేయడంతో పాటు జంతర్‌మంతర్ వద్ద జరిగిన సీజేపీ ఆందోళనలో పాల్గొనేలా ఇతర విద్యార్థులను ప్రోత్సహించారన్న ఆరోపణలను అందులో పేర్కొన్నట్లు సమాచారం. అయితే నోటీసు జారీ చేసిన మరుసటి రోజే దానిని ఉపసంహరించుకున్నట్లు కోర్టుకు తెలియజేశారు. అయినప్పటికీ తమ ఆదేశాలకు విరుద్ధంగా అసలు నోటీసు ఎందుకు జారీ చేయాల్సి వచ్చిందనే అంశంపై సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది.



# భారతరత్నకు 'సర్' కష్టాలు

## ఒక్క అక్షరం తేడాతో చిక్కులు!

**పాత, కొత్త ఓటరు జాబితాల్లో పేరు సరిపోలలేదని సమాచారం**

**ఈసీ నోటీసులు పంపినట్లు ప్రచారం**

**తమకు నోటీసులేవీ అందలేదన్న రావు ప్రతినిధి**

**గతంలో పద్మశ్రీ హరేకల హాజబ్బకూ ఇదే సమస్య**

**బెంగళూరు, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** బెంగళూరుకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న గ్రహీత ప్రొఫెసర్ సీఎన్ఆర్ రావుకు 'సర్' ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం(ఈసీ) నోటీసులు పంపించిందని సమాచారం. పాత ఓటరు లిస్టులో ఆయన పేరు.. ఒక అక్షరం కారణంగా ప్రస్తుతం రికార్డుల్లో ఉన్న పేరుతో మిస్‌మ్యాచ్ అయిందని వార్తలు వస్తున్నాయి. పాత రికార్డుల్లో ƒాతీశీట జచీ= ‡ఖశీ' అని ఉంటే, కొత్త రికార్డుల్లో ƒాతీశీటట జచీ= ‡ఖశీ' అని ఉంది. ఇందులో ఒక్క 'ఎఫ్' అక్షరం అదనంగా ఉండటం వల్ల ఈసీ నోటీసులు పంపించిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే ప్రొఫెసర్ సీఎన్ఆర్ ప్రతినిధి మాత్రం తమకు ఇప్పటిదాకా ఎలాంటి నోటీసులు అందలేదని మీడియాకు తెలిపారు. అలాగే ఒక్క అక్షరం అదనంగా ఉందని.. అది తప్ప మరే ఇతర సమస్యా లేదని ఆయన వివరించారు. ఒక్క సీఎన్ఆర్‌కే కాకుండా చాలా మంది ప్రముఖులకు సర్ నోటీసులు అందుతున్నాయి. మంగళూరుకు చెందిన పద్మశ్రీ గ్రహీత హరేకల హాజబ్బకు పేరులో వ్యత్యాసం కారణంగా 'సర్' నోటీసులు అందాయి. కర్ణాటక చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించారు. కాగా, కర్ణాటకలో జన్మించిన ప్రొఫెసర్ సీఎన్ఆర్ రావు స్ట్రక్చరల్ కెమిస్ట్రీలో విశేష కృషి చేసి 2014లో భారత అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న పొందారు. అలాగే ఆయన పద్మశ్రీ, పద్మవిభూషణ్, కర్ణాటక రత్న పురస్కారాలూ అందుకున్నారు.

# జిల్లా కలెక్ట రేట్ లో కాళోజీ నారాయణరావు జయంతి

## నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్ సెప్టెంబర్,09(సమయం న్యూస్)** కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి.బుధవారము కలెక్టరేట్ కార్యాలయ సమావేశము హాలు నందు వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అద్వర్యం లో ఏర్పాటు చేసిన కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకొని జిల్లాలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు.తెలంగాణ ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు,సామాజిక ఉద్యమకారుడు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ.. కాళోజి నారాయణరావు తన రచనలు, కవిత్వం ద్వారా ప్రజల సమస్యలను నిర్భయంగా ప్రపంచానికి తెలియజేసిన ప్రజాకవి అని అన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని తన సాహిత్యంలో ప్రతిబింబించిన మహోన్నత వ్యక్తి కాళోజి అని పేర్కొన్నారు. సామాజిక అన్యాయాలను ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు.కాళోజి ఆశయాలు, ఆలోచనా విధానం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, యువత ఆయన సాహిత్యాన్ని అధ్యయనం చేసి సమాజం పట్ల బాధ్యతతో ముందుకు




సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మానవతా దృక్పథం కోసం కాళోజి చేసిన కృషిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బి సి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి జయపాల్ రెడ్డి, డి ఆర్ ఓ స్వర్ణ లత, ఆర్ డి ఓ వాసుచంద్ర, డిప్యూటి కలెక్టర్ పూజ, వ్యవసాయ శాఖ అధికారి కవిత, డి పి ఆర్ ఓ చెన్నమ్మ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి పెద్ద మనసుతో చేయూత..

- రూ.5లక్షల 50 వేల విలువగల ఎల్ఓసీలు అందజేసిన ఎమ్మెల్యే 'కేఆర్ నాగరాజు'
- ఆపదలో నేనున్నానంటూ.. పేద కుటుంబాలకు ఎమ్మెల్యే భరోసా



**వర్ధన్నపేట, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్) :** అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు వైద్య చికిత్సలో ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసీ చెక్కులను వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు బాధిత కుటుంబాలకు అందజేశారు. వర్ధన్నపేట మండలం గుబ్బేట తండాకు చెందిన బానోత్ వెంకటరామ్ నాయక్ చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి రూ.3 లక్షల ఎల్ఓసీని మంజూరు చేయించారు. అదేవిధంగా దమ్మన్నపేట గ్రామానికి చెందిన అంగడి నర్సమ్మ వైద్య చికిత్స కోసం రూ.2.50 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించి, సంబంధిత ఎల్ఓసీ పత్రాలను హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ పేదల వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆపదలో ఉన్న నిరుపేదలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. వైద్య చికిత్స కోసం ఆర్థిక సాయం మంజూరు చేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ 4, 5వ వార్డులకు చెందిన నాయకులు కీమా నాయక్, రాజేందర్, మైబు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు సాహిత్యానికి ప్రజాకవి కాళోజీ చేసిన సేవలు చిరస్మరణీయం

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.
- ప్రజల గొంతుకాగా నిలిచిన కాళోజీ నారాయణరావు

**నారాయణపేట, సెప్టెంబర్,09 (సమయం న్యూస్)**

తెలుగు సాహిత్యానికి ప్రజాకవి కాళోజీ నారాయణరావు చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ తెలిపారు.కాళోజీ జయంతి వేడుకల సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కాళోజీ చిత్రపటానికి ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించరు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...తెలంగాణ భాషా పరిరక్షణకు కాళోజీ విశేషంగా కృషి చేయడంతో పాటు, తన కవితలు, రచనల ద్వారా ప్రజల్లో ఉద్యమ చైతన్యాన్ని నింపిన మహనీయుడు కాళోజీ నారాయణరావు అని కొనియాడారు. తెలుగు సాహితీ రంగానికి ప్రజాకవి కాళోజీ చేసిన సేవలు మరువలేనివని, తెలంగాణ ప్రాంతంలోని కవులు, రచయితలకు ఆయన ఒక దార్శనికుడిగా,స్ఫూర్తిదాతగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజల జీవన విధానం, వారి కష్టాలు, ఆకాంక్షలు, సామాజిక పరిస్థితులను తన రచనల ద్వారా ప్రతిబింబించిన గొప్ప ప్రజాకవి అని కొనియాడారు. ఆయన సాహిత్యం ప్రజల్లో



చైతన్యాన్ని నింపడమే కాకుండా, సమాజంలోని అన్యాయాలు, అసమానతలు,అణచివేతలపై ప్రశ్నించే ధైర్యాన్ని కల్పించిందని అన్నారు. భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మవిభూషణ్తో సత్కరించబడిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆశయాలు, స్ఫూర్తిని ప్రజలు కొనసాగించాలని ఆయన కోరారు.ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.డి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ మహేష్, RI విజయభాస్కర్, ఆఫీస్ సూపర్డెంట్ శ్యామ్ సుందర్ రాజు, RSI లు శివ శంకర్, శ్వేత, శివయ్య, పోలీసు సిబంది తది తరులు పాల్గొన్నారు.

# వలిగొండలో మండల స్థాయి క్రీడోత్సవాలు.

**వలిగొండ సెప్టెంబర్ 09 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో మండల స్థాయికి క్రీడోత్సవాలు శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వలిగొండలో సుంకోజు భాస్కర్ ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాధికారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రీడోత్సవాల్లో అండర్-14, అండర్-17 బాల బాలికల విభాగాల్లో ఖో- ఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి క్రీడా పోటీలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి టాస్ వేసి లాంఛనంగా ప్రారంభించారు అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలో పాల్గొంటున్న విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ క్రీడాకారులను ప్రముఖ హాకీ క్రీడాకారుడు భారత క్రీడ రంగానికి ఆదర్శప్రాయుడైన మేజర్ ధ్యాన్ చంద్ జీవన ప్రస్థానం క్రీడా విజయాలను ప్రస్తావిస్తూ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. క్రీడల్లో ప్రతిభతో పాటు క్రమశిక్షణ పట్టుదల సమయపాలన క్రీడా స్ఫూర్తి ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే నిరంతర సాధన తో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని క్రీడాకారులకు సూచించారు. గెలుపు ఓటమి సమానంగా స్వీకరిస్తూ పరస్పర గౌరవంతో క్రీడ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీకాంత్ రెడ్డి ఉప సర్పంచ్ ఎం మాధవి ఏఏపీసీ చైర్మన్ విజయలక్ష్మి ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పాలకూర్ల వెంకటేశం ప్రధానోపాధ్యాయులు నరేష్ కృష్ణ ప్రసాద్ కనకదుర్గ ఎస్ జీఎఫ్ఐ జి చంద్రిదాస్ టిజిపిఈటిఏ జిల్లా అధ్యక్షులు మల్లేశం మాజీ ఎంపిటిసి బత్తిని సహదేవ్ మాజీ సర్పంచ్ పబ్బు సురేందర్ ఏడిఈ మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాకవి కాళోజీ నారాయణరావు జీవితం నేటి తరానికి ఆదర్శనీయం



- కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జిల్లా కలెక్ట ర్ ప్రియాంక

**నారాయణపేట, సెప్టె ంబర్,09 (సమయం న్యూస్)** ప్రజాకవి కాళోజీ నారాయణరావు తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని, ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు.కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి హాల్ లో ఏర్పాటు చేసిన కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ. ప్రజల సమస్యలు, సామాజిక అంశాలను తన రచనల ద్వారా ప్రజల ముందుకు తీసుకువచ్చి వారిలో చైతన్య స్ఫూర్తిని నింపిన మహనీయుడు కాళోజీ అని అన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి పరిరక్షణకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమంలో కాళోజీ సాహిత్యం ప్రజల్లో చైతన్యం నింపిందని, ఆయన రచనలు, ఆలోచనా విధానాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాళోజీ ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల, డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, కలెక్టరేట్ ఏ వో అనిల్ కుమార్, డీ పీ ఆర్ వో రషీద్, మున్సిపల్ కమిషనర్ శంకర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వేములకొండ సబ్ సెంటర్లో పోషకాహార వారోత్సవాలు.



**వలిగొండ సెప్టెంబర్ 09 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ ప్రాథమిక సబ్ సెంటర్లో అంగన్వాడి టీచర్స్ అంబటి సువర్ణ,భోద్ర బోయిన శారద ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ అర్చన హాజరై వారు మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు పోషణ కలిగినటువంటి ఆహార పదార్థాలు ఆకు కూరలు పాలు గుడ్లు బెల్లం పల్లీలు నువ్వులు మునగ ఆకు మొదలగు ఆహార పదార్థాలు రోజువారి తినే ఆహారంలో తీసుకోవాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ ఓ సుదర్శన్ ఏఎన్ఎం జె వినోద గర్భిణీలు బాలింతలు ఆశ కార్యకర్తలు బోడ కవిత గుంటోజు రామలీల నీలం నీరజ గడ్డం సూర్య కళ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ నూతన గృహప్రవేశ పూజ

## సర్పంచ్ సీ .హెచ్ శివయ్య, మండల సీనియర్ నాయకులు పెరి రాజేందర్ రెడ్డి



**యాలాల మండలం, సెప్టెంబర్,09(సమయం న్యూస్)** యాలాల్ మండల కేంద్రంలో ఎరుకలి మణెమ్మ వెంకటప్ప నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ పూజ కార్యక్రమంలో పాల్గొని, వారికి శుభాకాంక్షలు తెలిపిన గ్రామ సర్పంచ్ సీ. హెచ్. శివయ్య, యాలాల మండల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాజేందర్ రెడ్డి.ఈ కార్యక్రమం లో 5వ వార్డ్ నెంబర్ అలవేలు, 6వ వార్డ్ నెంబర్ శేఖర్,గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షులు రాపోల్ నాగయ్య,మాజీ ఎఎంసి డైరెక్టర్ గౌనెగారి శ్రీనివాస్ (చిన్న)బుర్ణపూరి నర్సిములు, గడ్డం రాము గౌడ్,గడ్డం వెంకటయ్య గౌడ్, మ్యాదరి వేణు, సాయిలు, హన్మంతు,యదు,నాగప్ప

తమ సొంతింటి కళను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి రుణపడి ఉంటామని వారు సంతోషం వ్యక్తం చేశారు.

# తాళ్ల పల్లి లో ఘనంగా 'హర్ ఘర్ జల్' కార్యక్రమం



**చేవెళ్ల సెప్టెంబర్ .09(సమయం న్యూస్)** ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు – వృధా చేయకుండా ప్రతిజ్ఞ – గ్రామంలో ర్యాలీ, షాబాద్ మండలం

తాళ్లపల్లి గ్రామపంచాయతీలో మిషన్ భగీరథలో భాగంగా 'హర్ ఘర్ జల్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడటం, నీటిని పరిశుభ్రంగా వాడుకోవడం, నీటిని వృధా చేయకుండా కాపాడుకోవాలని గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వాతి మాణిక్యం గౌడ్, వార్డు సభ్యులు మాధవ చారి, శ్రవణ్ కుమార్, గ్రామ సెక్రటరీ నాగరాజు, మిషన్ భగీరథ DE గారు, AE గారు, వాటర్ లైన్ మెన్ కుమార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తాళ్ల పల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫారంలో పంపిణీ



**చేవెళ్ల సెప్టెంబర్.09.(సమయం న్యూస్)** షాబాద్ మండలం తాళ్లపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అందించిన ఉచిత యూనిఫారాల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ స్వాతి మాణిక్యం గౌడ్, ఉప సర్పంచ్,వార్డు మెంబర్లు , మాధవ్ చారి, గ్రామ కార్యదర్శి నాగరాజు,పాఠశాల ఉపాధ్యాయులు, కిరణ్మయి,మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. సర్పంచ్ స్వాతి మాణిక్యం గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

## జడ్చర్లలో ఓటరు జాబితా సవరణపై సమావేశం



**జడ్చర్ల సెప్టెంబర్ 9( సమయం న్యూస్)** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR)పై 75–జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ERO, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ అక్టోబర్ 7 వరకు, పరిష్కార ప్రక్రియ నవంబర్ 5 వరకు కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను నవంబర్ 9న ప్రచురించనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్త ఓటరు నమోదుకు ఫారం–6, పేరు తొలగింపు లేదా అభ్యంతరాలకు ఫారం–7, వివరాల సవరణకు ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన ఓటర్లు డ్రాఫ్ట్ జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవాలని హరిప్రియ సూచించారు.

## వేములలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 9( సమయం న్యూస్)** మూసాపేట మండలం వేముల గ్రామంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జడ్పీ ఉన్నత పాఠశాల, పల్లె దవాఖాన, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులు గణితంలో పట్టు సాధించేందుకు నిరంతరం సాధన చేయాలని సూచించారు. అంగన్‌వాడీలో ప్రభుత్వం నిర్దేశించిన 'ఎగ్ బిర్యానీ' మెనూ అమలు చేయకపోవడాన్ని గుర్తించిన కలెక్టర్, సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని స్పష్టం చేశారు.

## కాళోజీ నారాయణరావు జయంతి

### ఘన నివాళులర్పించిన- జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్




**వికారాబాద్, సెప్టెంబర్,09(సమయం న్యూస్)** తెలంగాణ ప్రజల హక్కులు, స్వేచ్ఛ, సామాజిక చైతన్యం కోసం తన కలంతో నిరంతరం పోరాడిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS మాట్లాడుతూ..."కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల గొంతుకగా నిలిచిన మహోన్నత వ్యక్తి. తన సాహిత్యం, రచనలు, ఆలోచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. అన్యాయం,అసమానతలు, సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా ఆయన తన కలంతో పోరాడారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి, సమాజ శ్రేయస్సు కోసం జీవితాంతం కృషి చేసిన కాళోజీ సేవలు చిరస్మరణీయం. యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా కృషి చేయాలి" అని అన్నారు.కాళోజీ సాహిత్యం ప్రజాస్వామ్య విలువలు, మానవత్వం, సామాజిక బాధ్యతలను ప్రతిబింబిస్తుందని, ఆయన చూపిన మార్గం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని ఎస్పీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా,ఐపీఎస్,డీసీఆర్బీ డీఎస్పీ జనయ్య, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య,ఏఆర్ డీఎస్పీ వీరేష్, డీ ఎస్ బి ఇన్‌స్పెక్టర్ నాగార్జున, టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్, RIలు నాగరాజు, శ్రీశైలం తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## సీఐ ను మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ ఎరుపుల వెంకటేశం.




**వలిగొండ సెప్టెంబర్ 09 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ ) ములుగు రవిని వేములకొండ గ్రామ సర్పంచ్ ఎరుపుల వెంకటేశం పులిపలుపుల రాములు ఎస్కే రసూల్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడుతూ మా వేములకొండ గ్రామంలో కొందరు వ్యక్తులు గంజాయికి అలవాటు పడి కుటుంబాలు ఆగమైతున్నాయి. ఇసుక నడుస్తుంది మా ఊరు పై నిఘా వేసి సహకరించాలని కోరారు.

# మాటకు హద్దు.. పోరాటానికి పద్ధతి ఉండాలి.!

- కాళోజీ స్ఫూర్తితో అన్యాయాన్ని ఎదిరించాలి...ఎంపీ డా.కడియం కావ్య
- ప్రజాకవి కాళోజీ రచనలు నేటి తరానికి దిక్సూచి
- స్పీకర్ పదవిని గౌరవించాలి.. అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలి
- మహిళా పోలీసుల పట్ల దురుసు ప్రవర్తనపై జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు



**హనుమకొండ, సెప్టెంబరు 9 (సమయం న్యూస్ :** శాసనసభ స్పీకర్ స్థాయిలో ఉన్న వ్యక్తిపై అనుచిత, అసభ్య పదజాలం ఉపయోగించడం ప్రజాస్వామ్య విలువలను దిగజార్చడమేనని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. శాసనసభలోని స్పీకర్ కుర్చీని, రాజ్యాంగబద్ధమైన పదవిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపైనా ఉందన్నారు. తప్పు జరిగితే అంగీకరించి క్షమాపణ చెప్పడం నాయకత్వ లక్షణమని పేర్కొన్నారు. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు 112వ జయంతి సందర్భంగా హనుమకొండలోని కాళోజీ విగ్రహానికి బుధవారం ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరించాల్సి ఉండగా, అనుచిత పదజాలానికి తావివ్వడం బాధాకరమన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కేసీఆర్ గతంలో ఇలాంటి భాషను ప్రోత్సహించారా? పార్ల మెంట్, అసెంబ్లీ లో ఇలాంటి పదజాలం ఎప్పుడైనా వినిపించిందా? అని ప్రశ్నించారు.

**మహిళా పోలీసులను గౌరవించాలి...**

మహిళా పోలీసు సిబ్బందితో వ్యవహరించిన తీరుపైనా ఎంపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మహిళా కానిస్టేబుల్ అయినా, ఉన్నతాధికారి అయినా ప్రతి మహిళను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. మహిళా పోలీసుల సమక్షంలో కేటీఆర్, హరీశ్‌రావు చొక్కాలు విప్పడం, ఆందోళన సమయంలో వ్యవహరించిన తీరు అభ్యంతరకరమని పేర్కొన్నారు. ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులైన కేటీఆర్, హరీశ్‌రావులను కమిషన్ ముందు వివరణ కోరాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. తెలంగాణ డీజీపీ, పోలీస్ కమిషనర్, శాసనసభ సెక్రటేరియట్, సంబంధిత అధికార యంత్రాంగం కూడా ఘటనను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాలంటే అసెంబ్లీలో ప్రశ్నించవచ్చని, ప్రభుత్వం సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉందని అన్నారు. ప్రజాధనంతో నిర్వహించే శాసనసభ సమావేశాలను అడ్డుకోవడం, కాలయాపన చేయడం ద్వారా ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీయాలని, విధానాలను ప్రశ్నించాలని, ప్రజా సమస్యలపై పోరాడాలని, అయితే ఆందోళనలు ప్రజాస్వామ్య పద్ధతుల్లో, హుందాగా సాగాలని సూచించారు.

**కాళోజీ స్ఫూర్తితో అన్యాయాన్ని ప్రశ్నించాలి...**

కాళోజీ నారాయణరావు కేవలం కవి మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల ఆవేదన, ఆకాంక్షలు, పోరాట స్ఫూర్తికి ప్రతిరూపమని కడియం కావ్య అన్నారు. అన్యాయాలు, సామాజిక అసమానతలు, దోపిడీపై తన కలాన్ని అస్త్రంగా మలిచి ప్రజల్లో చైతన్యం నింపారని కొనియాడారు. ఆయన రచనలు ప్రజల గుండె చప్పుడుగా మారాయని చెప్పారు. సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించే ధైర్యాన్ని కాళోజీ రచనలు కల్పించాయని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోనూ ఆయన ఆలోచనలు, రచనలు ప్రజల్లో చైతన్యం రగిలించాయని పేర్కొన్నారు. కాళోజీ పుట్టిన వరంగల్‌తో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉందని, ప్రజాకవి పుట్టిన నేల నుంచి ప్రజాప్రతినిధిగా పనిచేయడం గర్వంగా ఉందన్నారు. నేటి తరం కాళోజీ రచనలను విస్తృతంగా చదివి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కాళోజీ జ్ఞాపకార్థం రాష్ట్ర ప్రభుత్వం అందించే కాళోజీ స్మారక పురస్కారం ఆయన సాహిత్య, సామాజిక సేవలకు ఇచ్చే గౌరవానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. కాళోజీ స్ఫూర్తితో మరిన్ని రచనలు వెలువడి ప్రజలను చైతన్యపరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, సాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు శిక్షణ, మరియు అవగాహన కార్యక్రమం

- ఉచిత న్యాయ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలి
- జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలకు సమగ్ర ప్రణాళిక
- డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి, న్యాయమూర్తి నేరెళ్ల వెంకట హైమ పూజితను మర్యాదపూర్వకంగా కలిసిన డా.అనితా రెడ్డి



**హన్మకొండ, సెప్టెంబరు 9 (సమయం న్యూస్) :** జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సేవలు అందేలా విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి అన్నారు. ట్రాన్స్ఫర్‌పై హన్మకొండ జిల్లాకు వచ్చి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్‌ఎస్‌ఏ) కార్యదర్శి, న్యాయమూర్తి నేరెళ్ల వెంకట హైమ పూజితను బుధవారం డాక్టర్ అనితారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూజితను పుష్పగుచ్ఛంతో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ప్రజలకు మరింత ప్రయోజనం కలిగించేలా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఇరువురు చర్చించారు. గతంలో నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షిస్తూ, వాటికి మించి మరింత విస్తృతంగా, సమర్థవంతంగా ఉచిత న్యాయ సేవలను ప్రజలకు చేరువ చేసే మార్గాలపై ఆలోచనలు పంచుకున్నారు. ప్రత్యేకంగా న్యాయ సహాయం అవసరమైన పేదలు, అణగారిన వర్గాలు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు తదితరులకు న్యాయ సేవలపై అవగాహన కల్పించడం, వారి హక్కులపై చైతన్యం తీసుకురావడం వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, న్యాయ రంగానికి చెందినవారు, ఇతర సంబంధిత వర్గాలతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను రూపొందించాలని చర్చించారు. సమష్టి భాగస్వామ్యంతో చక్కటి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ప్రజలకు న్యాయ సేవలు సులభంగా అందేలా కృషి చేయాలని నిర్ణయించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపైనా డాక్టర్ అనితారెడ్డి, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి నేరెళ్ల వెంకట హైమ పూజిత చర్చించారు. డీఎల్‌ఎస్‌ఏ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని డాక్టర్ అనితారెడ్డి హామీ ఇచ్చారు.

# తెలంగాణ యాసకు యశస్సు తెచ్చి న ప్రజాకవి కాళోజీ

- ప్రజల భాషకు.. ప్రజల గొంతుకకు ప్రతిరూపం
- తెలంగాణ భాషా సంస్కృతికి పట్టం కట్టి న మహనీయుడు
- మున్సిపల్ చైర్పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్




**నర్సంపేట, సెప్టెంబరు 9 (సమయం న్యూస్) :** తెలంగాణ భాష, సంస్కృతి, ప్రజా చైతన్యానికి తన కలంతో ఊపిరి పోసిన ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు స్ఫూర్తి చిరస్మరణీయమని నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ అన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని బుధవారం నర్సంపేట మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజల సమస్యలు, ఆకాంక్షలను తన రచనలు, కవిత్వం ద్వారా సమాజం ముందుకు తీసుకొచ్చిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. ప్రజల భాషలోనే ప్రజల బాధలను, భావాలను తన రచనల్లో ప్రతిబింబించారని తెలిపారు. తన కలాన్ని సామాజిక చైతన్యానికి ఆయుధంగా మలచి, అన్యాయాన్ని ప్రశ్నించడంతో పాటు ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ కోసం కాళోజీ చేసిన కృషి ఆదర్శప్రాయమన్నారు. తెలంగాణ భాష కేవలం మాట్లాడే మాట కాదు, అది మన సంస్కృతి, జీవన విధానం, ఆత్మగౌరవానికి ప్రతీక అని శ్రీలక్ష్మి రామానంద్ పేర్కొన్నారు. తెలంగాణ యాస, భాషకు సాహిత్య గౌరవాన్ని తీసుకురావడంలో కాళోజీ పాత్ర విశిష్టమైనదని చెప్పారు. ఆయన సాహిత్యంలో ప్రతిధ్వనించిన ప్రజా సమస్యలు, సామాజిక స్పృహ నేటి తరానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. తెలంగాణ భాషా వైభవాన్ని పరిరక్షిస్తూ, మాతృభాష పట్ల గౌరవాన్ని మరింత పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. కాళోజీ ప్రజా చైతన్య స్ఫూర్తిని, ఆయన ఆలోచనా విధానాన్ని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, ఏఈ చంద్రమౌళి, కౌన్సిలర్లు మాదాసి రవి, ఏపూరి శ్రీనివాస్‌రెడ్డి, పున్నం నరసింహారెడ్డి, సలావుద్దీన్ అయూబ్‌ఖాన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణేష్ విగ్రహాల పోస్ట ర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**నారాయణపేట, సెప్టె ంబర్,09(సమయం న్యూస్)** వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, రసాయనాల వినియోగం వల్ల జల వనరులు కాలుష్యానికి గురవుచున్నాయని, అందుచే కృత్రిమ రంగులు, రసాయనాలతో చేసిన విగ్రహాలను మానివేసి మట్టితో చేసిన విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ వీసీ హాల్ లో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఈ సంవత్సరం, పర్యావరణం పై అవగహన కల్పించేందుకు, మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఎస్పీ వినీత్ తో కలీసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోని పర్యావరణాని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలలో భాగంగా 8 అంగుళాల మట్టి గణపతి లను అందించి పర్యావరణంపై అహగహన కార్యక్రమాలను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వారిచే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. చెరువుల్లో మట్టి మేటలను తొలిగించటానికి చెరువులో స్వచ్చత కాపాడటానికి వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తులు నడుము బిగించాలని మట్టి తో వినాయక విగ్రహాలు తాయారు చేసి భక్తితో చెరువులోకి చేర్చొచ్చని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు. మట్టి విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్మన్ మంజుల,ఈ.డి.ఎస్.సి.కార్పొరేషన్ అబ్దుల్ ఖలీల్,డీఎస్పీలు తదితరులు నల్ల పు లింగయ్య , మహేశ్, జిల్లా అధికారులు పాల్గొ న్నారు.



# వరద గుప్పిట్లో ఆసియా క్రీడల వేదిక!

## నాగోయాలో కుండపోత వర్షాలు

## అథ్లెట్లను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

## గంటలోనే 104 మిల్లీమీటర్ల వర్షపాతం

## రవాణా సేవలకు తీవ్ర అంతరాయం

## క్రీడలకు ఇబ్బంది లేదంటున్న అధికారులు

**నాగోయా, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** జపాన్‌లో జరగనున్న ఆసియా క్రీడలపై భారీ వర్షాలు, వరదల ప్రభావం పడుతోంది. క్రీడలకు ప్రధాన వేదికగా ఉన్న నాగోయాలో కుండపోత వర్షాలు కురుస్తుండటంతో ముందు జాగ్రత్తగా వందలాది మంది అథ్లెట్లు, సహాయక సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే పోటీ వేదికలకు ఎలాంటి నష్టం జరగలేదని, నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే క్రీడలు జరుగుతాయని నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు. నాగోయాలో మంగళవారం ఒక్క గంట వ్యవధిలోనే 104 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. భారీ వర్షాలతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో అథ్లెట్ల భద్రతను దృష్టిలో పెట్టుకుని అత్యవసర చర్యలు చేపట్టారు. క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక వసతి ప్రాంతాల్లోని వారిని ముందు జాగ్రత్తగా ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించారు. షిప్పింగ్ కంటైనర్లతో ఏర్పాటు చేసిన తాత్కాలిక వసతి కేంద్రాల్లో ఉన్నవారిని కూడా మార్చినట్లు సమాచారం. దాదాపు 400 మంది క్రీడాకారులు, ఇతర సిబ్బంది తాత్కాలిక ఆశ్రయ కేంద్రాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అథ్లెట్లందరూ సురక్షితంగానే ఉన్నారని జపాన్ అధికారులు వెల్లడించారు. వర్షాలు, వరదల కారణంగా క్రీడా వేదికలకు ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదని పేర్కొన్నారు.

### రవాణాపై వర్షాల దెబ్బ

నాగోయాలోని పలు ప్రాంతాలు నీటమునగడంతో ప్రజా రవాణాపైనా ప్రభావం పడింది. కొన్ని సబ్‌వే, బస్సు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. మరింత భారీ వర్షం కురిసే అవకాశం ఉండటంతో స్థానిక యంత్రాంగం అప్రమత్తమైంది. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టింది. ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న నేపథ్యంలో వివిధ దేశాలకు చెందిన క్రీడాకారులు జపాన్‌కు చేరుకుంటున్నారు. దీంతో వాతావరణ పరిస్థితులను నిర్వాహకులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రస్తుతానికి ఆసియా క్రీడల నిర్వహణకు ముప్పు లేదని అధికారులు చెబుతున్నప్పటికీ.. భారీ వర్షాలు కొనసాగితే ఏర్పడే పరిస్థితులపై ఆందోళన నెలకొంది. అథ్లెట్ల భద్రతతో పాటు రవాణా, వసతి ఏర్పాట్లు ఇప్పుడు నిర్వాహకులకు ప్రధాన సవాల్‌గా మారాయి.




# హోరాహోరీ పోరులో ఆల్కరాజ్ ఔట్..

## యూఎస్ ఓపెన్ సెమీస్‌లోకి బెన్ షెల్టన్

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ నుంచి డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కరాజ్ నిష్క్రమించాడు. ఇవాళ హోరాహోరీగా జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అమెరికన్ ప్లేయర్ బెన్ షెల్టన్ అద్భుత విజయాన్ని నమోదు చేశాడు. అయిదు సెట్ల థ్రిల్లింగ్ మ్యాచ్‌ను 6-7(5), 6-1, 6-3, 1-6, 7-6(7) స్కోరుతో షెల్టన్ గెలుచుకున్నాడు. మడిమ గాయం నుంచి కోలుకుని టోర్నీలో అడుగుపెట్టిన అల్కరాజ్.. ఈ మ్యాచ్‌లో చివరి వరకు పోరాడు. సుమారు 4 గంటల 28 నిమిషాల పాటు ఈ మ్యాచ్ జరిగింది. అల్కరాజ్‌పై తన కెరీర్‌లో తొలిసారి విజయం సాధించాడు బెన్. నాలుగు నెలల గాయం తర్వాత అల్కరాజ్ ఆడిన ఫస్ట్ టోర్నీ ఇదే. కానీ అతని ఆశలపై నీళ్లు చల్లాడు యువ ప్లేయర్ షెల్టన్. గాయం వల్ల స్పెయిన్ ప్లేయర్ అల్కరాజ్ సరైన రీతిలో తన సత్తాను ప్రదర్శించలేకపోయాడు. సమారు 52 అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్స్ చేశాడు. టై బ్రేకర్ వరకు వెళ్లిన తొలి సెట్‌ను అల్కరాజ్ చివరకు సొంతం చేసుకున్నాడు. కానీ ఆ తర్వాత చాలా భీకరంగా షెల్టన్ చెలరేగిపోయాడు. రెండవ, మూడవ సెట్లను బెన్ ఈజీగా నెగ్గేశాడు. ఫోర్‌హ్యాండ్ షాట్లతో ఆకట్టుకున్నాడు. కానీ నాలుగో సెట్‌లో అల్కరాజ్ తన రిథమ్‌ను మళ్లీ అందుకున్నాడు. బేస్‌లైన్ షాట్లు, స్పీడ్‌తో ఆ సెట్‌ను 6-1 తేడాతో నెగ్గి మ్యాచ్‌ను డిసైడర్ సెట్‌లోకి పంపాడు. ఇక ఆ ఫైనల్ సెట్‌లో ఇద్దరూ అమీతుమీ అన్నట్లుగా ఆడారు. సూపర్ టైబ్రేక్‌కు ఆ సెట్ వెళ్లింది. స్టేడియంలో మ్యాచ్‌ను వీక్షిస్తున్న ప్రేక్షకులు తీవ్ర ఉత్కంఠకు లోనయ్యారు. కానీ చివరకు బెన్ షెల్టన్ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. 10-7తో టైబ్రేక్ సాధించాడు. దీంతో అతను రెండోసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్‌లోకి ప్రవేశించాడు. న్యూయార్క్‌లోని ఆర్థర్ ఆషే స్టేడియంలో క్వార్టర్స్ మ్యాచ్‌ను ఆలస్యంగా ప్రారంభించారు. దీనికి తోడుగా 4 గంటలకు పైగా మ్యాచ్ సాగడం వల్ల.. తెల్లవారుజామున మూడున్నరకు మ్యాచ్ ముగిసింది.

# బిగ్‌బాష్‌లోకి ప్రైవేట్ ఎంట్రీ

- ఐపీఎల్ ఓనర్లకు బంపర్ ఛాన్స్!
- ప్రైవేట్ పెట్టుబడులకు క్రికెట్ ఆస్ట్రేలియా గ్రీన్‌సిగ్నల్
- 2027-28 సీజన్ నుంచి కొత్త యాజమాన్య విధానం
- తొలుత మెల్‌బోర్న్ రెనెగేడ్స్ విక్రయానికి రంగం సిద్ధం
- ప్రపంచ టీ20 మార్కెట్‌లో ఐపీఎల్ యజమానులకు మరో అవకాశం
- నియంత్రణ మాత్రం క్రికెట్ ఆస్ట్రేలియా చేతుల్లోనే



**మెల్‌బోర్న్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** ఆస్ట్రేలియా క్రికెట్‌లో కీలక పరిణామం చోటుచేసుకోనుంది. దేశంలో అత్యంత ఆదరణ పొందిన బిగ్‌బాష్ లీగ్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు తలుపులు తెరిచేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా సిద్ధమైంది. 2027-28 సీజన్ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుండగా.. మెల్‌బోర్న్ రెనెగేడ్స్‌ను తొలిసారిగా పూర్తిస్థాయి ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించే దిశగా అడుగులు పడుతున్నట్లు సమాచారం. ఈ నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా పలు టీ20 జట్లను కలిగి ఉన్న ఐపీఎల్ ఫ్రాంచైజీ యజమానులకు మరో భారీ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఇప్పటివరకు ప్రపంచంలోని ప్రధాన టీ20 లీగ్‌లతో పోలిస్తే బిగ్‌బాష్‌లో ప్రైవేట్ ఫ్రాంచైజీ యాజమాన్యానికి అవకాశం లేకపోవడం ప్రత్యేకత. తాజా నిర్ణయంతో ఆ పరిస్థితి మారనుంది. అయితే బిగ్‌బాష్‌ను పూర్తిగా ప్రైవేట్ సంస్థల చేతుల్లో పెట్టకుండా కీలక నియంత్రణలను క్రికెట్ ఆస్ట్రేలియానే కొనసాగించనున్నట్లు సమాచారం.

### ఐపీఎల్ ఓనర్ల కన్ను పడితే..!

ఐపీఎల్ జట్ల యజమానులు ఇప్పటికే దక్షిణాఫ్రికా, యూఏఈ, అమెరికా, వెస్టిండీస్, ఇంగ్లండ్ సహా వివిధ దేశాల్లోని టీ20 లీగ్‌ల్లో పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు ఆస్ట్రేలియా మార్కెట్ కూడా అందుబాటులోకి వస్తే ప్రపంచ టీ20 క్రికెట్‌లో వారి వ్యాపార సామ్రాజ్యం మరింత విస్తరించే అవకాశం ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, ఆర్‌పీ-సంజీవ్ గోయెంకా గ్రూప్, జీఎంఆర్-జేఎస్‌డబ్ల్యూ వంటి సంస్థలు ఇప్పటికే వివిధ దేశాల్లో ఫ్రాంచైజీలను నిర్వహిస్తున్నాయి. బిగ్‌బాష్‌లోనూ జట్లను సొంతం చేసుకుంటే ఒకే యాజమాన్యం కింద వివిధ లీగ్‌ల్లో ఆటగాళ్లను కొనసాగించే వ్యూహాలకు మరింత అవకాశం లభించవచ్చు.

### ఒకే బ్రాండ్.. పలు లీగ్‌లు

కామెరాన్ గ్రీన్, టిమ్ డేవిడ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్ వంటి అంతర్జాతీయ ఆటగాళ్లను ఒకే యాజమాన్యానికి చెందిన ఐపీఎల్, ఎస్ఏ20, మేజర్ లీగ్ క్రికెట్, బిగ్‌బాష్ జట్లలో ఒప్పందాల ద్వారా కొనసాగించే అవకాశాలు పెరగవచ్చు. తద్వారా ఆటగాళ్ల నిర్వహణతో పాటు ఒకే బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించుకునేందుకు ఫ్రాంచైజీలకు అవకాశం ఉంటుంది. అయితే ఇక్కడే మరో సమస్య ఉంది. బిగ్‌బాష్ సాధారణంగా డిసెంబర్--జనవరిలో జరుగుతుండగా అదే సమయంలో దక్షిణాఫ్రికా ఎస్ఏ20, యూఏఈ అంతర్జాతీయ లీగ్ టీ20 కూడా జరుగుతాయి. ఒకే యాజమాన్యానికి వివిధ లీగ్‌ల్లో జట్లు ఉంటే స్టార్ ఆటగాళ్లను ఏ జట్టుకు కేటాయించాలన్న విషయంలో అంతర్గత పోటీ తప్పకపోవచ్చు.

### భారత స్టార్లకు మాత్రం నో ఎంట్రీ

ఐపీఎల్ యజమానులు బిగ్‌బాష్ జట్లను కొనుగోలు చేసినా భారత పురుష క్రికెటర్లను అక్కడ ఆడించడం ప్రస్తుత నిబంధనల ప్రకారం సాధ్యం కాదు. భారత క్రికెట్ నియంత్రణ మండలి తన క్రికెటర్లు విదేశీ టీ20 లీగ్‌ల్లో పాల్గొనేందుకు సాధారణంగా అనుమతించడం లేదు. అయితే భారత మహిళా క్రికెటర్లు గతంలో బిగ్‌బాష్‌లో పాల్గొన్నారు. భవిష్యత్తులో రిటైర్డ్ లేదా ఒప్పంద పరిధిలో లేని పురుష ఆటగాళ్ల విషయంలో భారత బోర్డు నిబంధనలు సడలిస్తే బిగ్‌బాష్‌లో పెట్టుబడులు పెట్టే భారత ఫ్రాంచైజీలకు అదనపు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది.

### పగ్గాలు మాత్రం సీఏ చేతుల్లోనే

ప్రైవేట్ పెట్టుబడులకు అవకాశం కల్పించినా బిగ్‌బాష్‌పై క్రికెట్ ఆస్ట్రేలియా నియంత్రణ కొనసాగనుంది. అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్, ఆటగాళ్ల లభ్యత, ప్రసార హక్కులు, జీతాల పరిమితి వంటి కీలక అంశాల్లో బోర్డుదే ప్రధాన పాత్రగా ఉండనుంది. ఫ్రాంచైజీలను కొనుగోలు చేయాలనుకునే సంస్థలను ఆమోదించడం లేదా తిరస్కరించే అధికారం కూడా క్రికెట్ ఆస్ట్రేలియాకే ఉండనున్నట్లు సమాచారం. యాజమాన్య వైవిధ్యాన్ని కాపాడేందుకు ఒకే దేశానికి లేదా ఒకే వర్గానికి చెందిన సంస్థలు ఎన్ని జట్లను సొంతం చేసుకోవచ్చన్న అంశంలోనూ పరిమితులు విధించే అవకాశముంది. మొత్తానికి బిగ్‌బాష్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు తలుపులు తెరుచుకుంటే ప్రపంచ టీ20 క్రికెట్ వ్యాపారంలో మరో కీలక మార్పునకు నాంది పడనుంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఫ్రాంచైజీలను విస్తరిస్తున్న ఐపీఎల్ యజమానులకు ఆస్ట్రేలియా మార్కెట్ ఇప్పుడు కొత్త ఆకర్షణగా మారే అవకాశముంది.

# 100 వికెట్ల క్లబ్‌లో రాబిన్సన్ 'స్పెషల్'!

- 24వ టెస్టులోనే వంద వికెట్ల మైలురాయి
- సయీమ్ అయూబ్‌ను ఔట్ చేసి ఘనత
- 20లోపు సగటుతో అరుదైన రికార్డు
- బుమ్రా సరసన ఇంగ్లండ్ పేసర్
- పాక్‌పై వరుసగా మూడో టెస్టులోనూ జోరు







**బర్మింగ్‌హామ్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** ఇంగ్లండ్ పేసర్ ఓలీ రాబిన్సన్ టెస్టు క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. పాకిస్థాన్‌తో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా బుధవారం ప్రారంభమైన మూడో టెస్టులో సయీమ్ అయూబ్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి తన టెస్టు కెరీర్‌లో 100వ వికెట్‌ను పూర్తి చేసుకున్నాడు. 32 ఏళ్ల రాబిన్సన్‌కు ఇది 24వ టెస్టు కావడం విశేషం. అంతేకాదు.. 100 వికెట్ల మైలురాయి చేరే సమయానికి 20 కంటే తక్కువ బౌలింగ్ సగటు కలిగిన అత్యంత అరుదైన ఆధునిక బౌలర్ల జాబితాలో రాబిన్సన్ చోటు సంపాదించాడు. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం గత వందేళ్లలో 100 టెస్టు వికెట్లు తీసిన సమయంలో అత్యుత్తమ సగటు నమోదు చేసిన బౌలర్‌గా రాబిన్సన్ నిలిచాడు. జస్ప్రీత్ బుమ్రా పేరిట ఉన్న రికార్డును అధిగమించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

### సయీమ్‌తోనే 'సెంచరీ'

టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. రాబిన్సన్ తన తొలి ఓవర్‌లోనే సయీమ్ అయూబ్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసినప్పటికీ సమీక్షలో నిర్ణయం మారింది. అయితే తన తర్వాతి ఓవర్‌లోనే సయీమ్‌ను ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్‌కు పంపి 100వ వికెట్ మైలురాయిని అందుకున్నాడు.

### పాక్‌పై రాబిన్సన్ 'రాజ్'

ప్రస్తుత సిరీస్‌లో రాబిన్సన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఎనిమిది వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. రెండో టెస్టులోనూ 4-11, 4-24తో మరో ఎనిమిది వికెట్లు తీసి వరుసగా రెండోసారి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. రెండేళ్లకు పైగా టెస్టు జట్టుకు దూరంగా ఉండి తిరిగి వచ్చిన రాబిన్సన్.. ఇప్పుడు 100 వికెట్ల మైలురాయితో తన పునరాగమనాన్ని మరింత


# రూ.130 కోట్లకు పైగా డీల్!

## బీసీసీఐతో చాట్‌జీపీటీ, క్యాంపా, ఎస్‌బీఐ లైఫ్ ఒప్పందం

- మూడు దిగ్గజ బ్రాండ్లు అసోసియేట్ పార్ట్‌నర్లుగా ఎంపిక
- రూ.130 కోట్లకు పైగా ఆదాయంతో 44 శాతం వృద్ధి
- 2028 మార్చి వరకు భారత్‌లో జరిగే మ్యాచ్‌లకు వర్తింపు




**ముంబై, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తమ స్వదేశీ క్రికెట్ సీజన్‌కు సంబంధించి ప్రముఖ పానీయాల బ్రాండ్ 'క్యాంపా', ఇన్సూరెన్స్ సంస్థ 'ఎస్‌బీఐ లైఫ్'తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ 'చాట్‌జీపీటీ'లను అసోసియేట్ పార్ట్‌నర్లుగా ప్రకటించింది. రాబోయే వెస్టిండీస్ సిరీస్‌తో ప్రారంభమై 2028 మార్చి వరకు (మొత్తం 35 మ్యాచ్‌లకు) ఈ భాగస్వామ్యం అమల్లో ఉండనుంది. ఈ రెండు సీజన్ల ఒప్పందం ద్వారా బీసీసీఐకి రూ.130 కోట్లకు పైగా ఆదాయం లభించనుండగా, గత సైకిల్‌తో పోలిస్తే ఒప్పంద విలువ ఏకంగా 44 శాతం పెరగడం విశేషం. బిడ్డింగ్‌లో క్యాంపా కోలా మ్యాచ్‌కు రూ.1.31 కోట్లు, ఎస్‌బీఐ లైఫ్ మరియు చాట్‌జీపీటీ మ్యాచ్‌కు రూ.1.2 కోట్ల చొప్పున బిడ్లు దాఖలు చేసి భాగస్వామ్య హక్కులను సొంతం చేసుకున్నాయి. ఈ సందర్భంగా బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, గౌరవ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. ఏఐ, ఇన్సూరెన్స్, బెవరేజెస్ వంటి విభిన్న రంగానికి చెందిన అంతర్జాతీయ బ్రాండ్లు భారత క్రికెట్‌పై చూపుతున్న నమ్మకానికి ఈ భారీ డీల్ నిదర్శనమని తెలిపారు. భారత హోమ్ సీజన్ మార్కెట్‌లో ఎంతటి క్రేజ్, డిమాండ్ ఉందో ఈ 44 శాతం వృద్ధి స్పష్టం చేస్తోందని వారు ఆనందం వ్యక్తం చేశారు. గ్రౌండ్ బ్రాండింగ్, బ్రాడ్‌కాస్ట్ గ్రాఫిక్స్ ద్వారా ఈ బ్రాండ్లు ప్రచారం పొందనున్నాయి.




# డూప్ వద్దు.. నేనే దూకేస్తా

## 'సర్దార్ 2' సెట్స్‌లో మాళవిక సాహసం


హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్): నటుడు కార్తి కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'సర్దార్ 2' చిత్రంలో నటిస్తున్న భామ మాళవిక మోహనన్ యాక్షన్ సన్నివేశాల్లో డూప్ (బాడీ డబుల్) లేకుండా నటించి చిత్ర బృందాన్ని ఆశ్చర్యపరిచింది. పి.ఎస్. మిత్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ తొలిరోజే రోప్‌ల సాయంతో ఎత్తైన ప్రదేశం నుండి స్విమ్మింగ్ పూల్‌లోకి దూకే రిస్కీ సీన్ ఇచ్చారని, డూప్‌ను వద్దని చెప్పి స్వయంగా తానే ఆ స్టంట్‌ను పూర్తి చేసినట్లు మాళవిక వెల్లడించింది. జిమ్నాస్టిక్స్, 'తంగలాన్' సినిమా కోసం నేర్చుకున్న కర్రసాము శిక్షణ ఈ స్టంట్ చేయడానికి తనకు ఎంతగానో ఉపయోగపడ్డాయని తెలిపింది. యాక్షన్ సీన్స్ అలవోకగా చేయడంలో సీనియర్ నటుడు విక్రమ్ ఇచ్చిన సలహాలు, తోటి నటుడు ఎస్.జె. సూర్య నటన తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని, భవిష్యత్తులో పవర్‌ఫుల్ లేడీ విలన్ పాత్రలు చేయడానికి కూడా తాను సిద్ధమేనని ప్రకటన చేసింది. కథానాయకుడు కార్తి ఎంతో జోవియల్, మంచి మనసున్న వ్యక్తి అని, తెలుగు ప్రేక్షకులకు ఆయన దత్తపుత్రుడి లాంటి వారని కొనియాడింది. గ్రాండ్ విజువల్స్, బ్యాంకాక్‌లో చిత్రీకరించిన మైండ్ బ్లోయింగ్ యాక్షన్ ఎపిసోడ్స్‌తో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన 'సర్దార్ 2' చిత్రం సెప్టెంబర్ 10న థియేటర్లలోకి వస్తోందని మాళవిక స్పష్టం చేసింది.

# రణబాలి టీజర్‌లో విజయ్ విశ్వరూపం




హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్): విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి' టీజర్‌ను చిత్రబృందం బుధవారం విడుదల చేసింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం 1854 నుంచి 1878 మధ్య కాలంలో బ్రిటిష్ పాలనలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా, ఫిక్షన్ అంశాలను జోడించి రూపొందిస్తున్నట్లు టీజర్ చూస్తే తెలుస్తోంది. ఇందులో విజయ్ దేవరకొండ విశ్వరూపం చూపించగా, కథలోని యాక్షన్, పీరియాడిక్ డ్రామా ప్రేక్షకుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ సినిమాలో విజయ్ సరసన రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ పవర్‌ఫుల్ ప్రతినాయక పాత్రలో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి టీ-సిరీస్ సమర్పణలో అజయ్-అతుల్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ భారీ పిరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను దసరా కానుకగా అక్టోబర్ 16న తెలుగు, హిందీతో పాటు ప్రధాన భారతీయ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.







# 'ముద్దు సీన్ ఉంటే అడల్ట్ సినిమానా?'

## 'ఎపిక్' ట్రోలింగ్‌పై నాగవంశీ స్ట్రాంగ్ కౌంటర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** యువ హీరో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటించిన 'ఎపిక్' సినిమా ట్రైలర్‌లోని రొమాంటిక్, ముద్దు సన్నివేశాలపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ట్రోలింగ్‌కు నిర్మాత సూర్యదేవర నాగవంశీ ఘాటుగా స్పందించారు. సినిమాలో ముద్దు సన్నివేశం కనిపించినంత మాత్రాన దానిని 'అడల్ట్ సినిమా'గా ముద్ర వేయడం సరికాదని అన్నారు. సినిమా పూర్తిగా చూసిన తర్వాతే దానిపై అభిప్రాయానికి రావాలని సూచించారు. 'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మరోసారి జంటగా నటించిన చిత్రం 'ఎపిక్'. ఆదిత్య హాసన్ దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలతో సినిమాపై యువతలో ఆసక్తి పెరగగా.. ట్రైలర్‌లోని కొన్ని రొమాంటిక్ సన్నివేశాలపై విమర్శలు కూడా వచ్చాయి. తాజాగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో ఈ ట్రోలింగ్‌పై నాగవంశీ స్పందించారు. కార్యక్రమానికి వచ్చిన కొందరు ప్రేక్షకులను వేదికపైకి పిలిచి ట్రైలర్‌లోని రొమాంటిక్ సన్నివేశాలపై వారి అభిప్రాయాలను అడిగారు. అనంతరం సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విమర్శలకు సమాధానమిచ్చారు. ఒకటి రెండు సన్నివేశాలను చూసి మొత్తం సినిమాపై ఓ నిర్ణయానికి రావడం సరికాదన్నారు. 'ఎపిక్' కేవలం రొమాంటిక్ సన్నివేశాల చుట్టూ తిరిగే చిత్రం కాదని, నేటి యువత ఆలోచనలు, ప్రేమ, భావోద్వేగాలను ప్రతిబింబించే కథగా తెరకెక్కించినట్లు చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారానికి భిన్నంగా 'ఎపిక్'ను కుటుంబ ప్రేక్షకులు కూడా కలిసి చూసి ఆస్వాదించవచ్చని నాగవంశీ తెలిపారు. సినిమాలో రొమాన్స్ కథలో భాగంగానే ఉంటుందని, దానిని మాత్రమే పట్టుకుని సినిమాపై ఒక అభిప్రాయానికి రావద్దన్నారు. యువతకు కనెక్ట్ అయ్యే అంశాలతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే భావోద్వేగాలు కూడా ఉంటాయని పేర్కొన్నారు.

# బాలయ్య-కొరటాల మూవీలో ఇద్దరు ఐశ్వర్యలు

## మేకోవర్ చూస్తే షాకే!

## తొలి షెడ్యూల్ అక్టోబర్‌లో షురూ

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్):** నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న క్రేజీ ప్రాజెక్ట్ (ఎన్‌బీకే 112) పై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో బాలకృష్ణను కేవలం మాస్ యాంగిల్‌కే పరిమితం చేయకుండా, మునుపెన్నడూ చూడని సరికొత్త మేకోవర్‌తో, కొత్త షేడ్స్‌లో చూపించేందుకు కొరటాల శివ ప్లాన్ చేస్తున్నారు. ఈ భారీ చిత్రానికి సంబంధించిన తొలి షూటింగ్ షెడ్యూల్ అక్టోబర్ మొదటి వారం నుంచి ప్రారంభం కానుండగా, బాలకృష్ణ లేని కీలక సన్నివేశాలు మరియు 15 రోజుల పాటు సాగే హై-వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్లను ప్రత్యేక సెట్‌లో చిత్రీకరించనున్నారు. ఇక ఈ చిత్రంలో కథానాయికగా మలయాళ నటి ఐశ్వర్య లక్ష్మి పేరును చిత్రయూనిట్ దాదాపు ఖరారు చేసినట్లు ఫిల్మ్‌నగర్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. 'సంబరాల ఏటిగట్టు'తో పాటు పలు చిత్రాల్లో నటిస్తున్న ఆమెకు బాలయ్య సరసన నటించే అవకాశం దక్కడం కెరీర్‌కు పెద్ద మలుపుగా మారనుంది. మరొక ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఈ సినిమాలో కీలకమైన 'లేడీ విలన్' పాత్ర కోసం ప్రముఖ నటి ఐశ్వర్య రాజేష్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా, ఐశ్వర్య రాజేష్ నెగెటివ్ షేడ్‌లో నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై మరింత ఉత్కంఠ నెలకొంది. ఈ నటీనటుల వివరాలపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది.







Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# క్రీడా సమరానికి కొడంగల్ వేదిక.. విద్యార్థుల్లో ఉత్సాహం

- **ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్**

**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,09(సమయం న్యూస్)** వికారాబాద్ జిల్లా కొడంగల్ జోన్ పరిధిలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతర్ పాఠశాల క్రీడా పోటీలు జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో నిర్వహించారు. కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, దుద్యాల, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాలీబాల్, ఖో–ఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ తదితర క్రీడాంశాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల సందర్భంగా క్రీడా మైదానాలు విద్యార్థుల కేరింతలు, ఉత్సాహంతో సందడిగా మారాయి. గెలుపు కోసం విద్యార్థులు పట్టుదలతో పోటీ పడుతూ తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. క్రీడలు విద్యార్థులలో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, క్రీడా ఉపాధ్యాయులు (PET/PD), విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



**విద్యార్థుల కోసం ప్రత్యేక ఆహార వసతులు**

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, ఎప్పటిలాగే నందారం ప్రశాంత్ ఆధ్వర్యంలో క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు ఆహార వసతులను ఏర్పాటు చేశారు. పోటీలకు వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.క్రీడా పోటీల ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి ఉన్నత స్థాయి పోటీల్లో రాణించే అవకాశాలను కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని నందారం ప్రశాంత్ తెలిపారు.Sports Build Stronger" అనే స్ఫూర్తితో విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

# భద్రత, బందోబస్తు కొరకే గణేష్ ఆన్లైన్ నమోదు విధానం

- **గణేష్ మండప నిర్వాహకులు పోలీసు శాఖ వారు రూపొందించిన పోర్ట ల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని పోలీసు వారికి సహకరించాలి.**
- **అప్లికేషన్ నమోదు చేయుటకు వాడవలసిన లింక్ http://policeportal.tspolice.gov.in/index.htm.**
- **జిల్లా ఎస్పీ డాక్ట ర్ వినీత్ IPS.**



**నారాయణపేట, సెప్టెంబర్, 09( సమయం న్యూస్)** పోలీసు శాఖ వారు రూపొందించిన గణేష్ మండపం నిర్వహణకు సంబంధించిన ఆన్లైన్ ఇన్ఫర్మేషన్ అనేది కేవలం మండపం నిర్వహణ మరియు మండపం నకు సంబంధించిన సమాచారం కొరకు మాత్రమే రూపొందించిందని అని, ఈ యొక్క సమాచారం ద్వారా భద్రత మరియు బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులకు సులువుగా ఉంటుందని, ఆన్ లైన్ ఇన్ఫర్మేషన్ కు ఎటువంటి రుసుము లేదని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS తెలిపారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులు గణేష్ విగ్రహాలను వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేయుటకు ముందు, ముందస్తు సమాచారం పోలీసుస్టేషన్ లో సమాచారం ఇవ్వాలని అందుకోసం ఏదైనా కంప్యూటర్, మొబైల్ నందు అప్లై చేసుకోవాలి అని అన్నారు. అందుకొరకు http://policeportal.tspolice.gov.in అనే site నందు వివరాలు పొందు పరచి అప్లికేషన్ ను సంబంధిత పోలీస్ స్టేన్ నందు అందించాలని సూచించారు.

**వినాయకుడి మండపాలు ఏర్పాటు చేసే వారికి నారాయణపేట జిల్లా పోలీసు వారి విజ్ఞప్తి**

1. భద్రత, బందోబస్తు కొరకే గణేష్ ఆన్లైన్ నమోదు విధానం. గణేష్ మండప నిర్వాహకులు పోలీసు శాఖ వారు రూపొందించిన పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని పోలీసు వారికి సహకరించాలి.
2. గణేష్ మండపాలను ప్రజా రవాణాకు, ఎమర్జెన్సీ వాహనాలు వెళ్లడానికి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి.
3. మండపాలు ఏర్పాటు చేసేవారు సంబంధిత శాఖల అనుమతి, విద్యుత్ శాఖ వారి అనుమతి పత్రంతోనే విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలి.
4. మండపాలకు పూర్తి బాధ్యత మండపాల నిర్వాహకులదే, ప్రతి మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
5. గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు ఫోన్ నెంబర్లు మండపంలో ఏర్పాటు చేయాలి.
6. గణేష్ మండపంలో 24 గంటలు 4గురు వాలంటరీ ఉండే విధంగా నిర్వాహకులు తగు చర్యలు తీసుకోవాలి.
7. గణేష్ ప్రతిమలు కూర్చోబెట్టే ప్రదేశంలో షెడ్డు నిర్మాణం మంచి నాణ్యతతో ఏర్పాటు చేసుకోవాలి, షార్ట్ సర్క్యూట్ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
8. మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తతో, fire extinguisher డ్రమ్ముల్లో నీరు, ఇసుకను ఏర్పాటు చేసుకోవాలి.
9. గణేష్ మండపాలకు వచ్చే భక్తుల సందర్శన దృష్టిలో ఉంచుకొని భక్తుల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు వాలంటరీలను నియమించాలి.
10. మండపాల్లో మరియు శోభాయాత్రలో ఎట్టి పరిస్థితుల్లో డీజే లను ఏర్పాటు చేయరాదు.
11. విద్యాసంస్థలకు, హాస్పిటల్స్ కు, ప్రార్థన మందిరాలకు, వృద్ధులకు, చిన్న పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండే చిన్న స్పీకర్లను పోలీస్ శాఖ వారి అనుమతితో మాత్రమే ఏర్పాటు చేసుకోవాలి. మండపాల వద్ద భక్తి గీతాలు మాత్రమే ప్లే చేయాలి
12. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలి.
13. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, జూదం ఆడడం, అసభ్యకరమైన నృత్యాలు ఏర్పాటు చేయడం, ఇతరులను కించపరిచే విధంగా ప్రసంగాలు, పాటలు ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధం.
14. ఇతరుల మనోభావాలను కించపరిచే విధంగా మండపాల వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం పూర్తిగ నిషేధం.
15. మండపాల్లో ఏదైనా అనుమానాస్పద బ్యాగులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 112, లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి.
16. మండపాల వద్ద నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర కార్యక్రమలు నిర్వహించేటప్పుడు పోలీసు వారికి ముందుగానే తెలియపరచాలి. తద్వారా మండపాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా పోలీస్ శాఖ చూసుకోవడం జరుగుతుంది.
17. గణేష్ విగ్రహాల ప్రతిష్టాపన రోజున నిర్దిష్ట సమయానికి విగ్రహాలను మండపానికి చేరుకునే విధంగా నిర్వాహకులు చూసుకోవాలి.
18. మధ్యాహ్నం నుండే గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రారంభించి నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తయ్యే విధంగా మండప నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి.
19. గణేష్ విగ్రహాల ప్రతిష్టాపన రోజున మరియు నిమజ్జనం రోజున నిర్వాహకులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ ట్రాఫిక్ ఎలాంటి అంతరాయం కలిగించకుండా శోభాయాత్రను నిర్వహించుకోవాలి.
20. గణేష్ శోభాయాత్ర సమయంలో ఇతరులపై రంగులు చల్లడం చేయకూడదు.
21. శోభయాత్ర సమయంలో ఇతరులను కించపరిచే విధంగా స్లొగన్స్ చేయకూడదు.
22. శోభయాత్ర సమయంలో టపాసులు పేల్చడం పూర్తిగా నిషేధం.
23. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి రుమర్స్, వదంతులు నమ్మకూడదు ఎలాంటి సందేహం ఉన్న సంబంధిత పోలీసు వారికి లేదా డయల్ 112 కి సమాచారం అందించాలి.
24. మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చే పోలీస్ శాఖ గణేష్ మండపల వద్ద, శోభాయాత్రలో మహిళలకు, పిల్లలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు.
25. గణేష్ శోభాయాత్రకు ఉపయోగించే వాహనాలను సరైన కండిషన్లో ఉండాలి , అదేవిధంగా డ్రైవర్ కు డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు వాహనం సంబంధించిన పేపర్స్ ఉండాలి.
26. మద్యం సేవించి శోభాయాత్రలో ఎట్టి పరిస్థితిలో పాల్గొనరాదు.
27. గణేష్ మండపాలో పాయింట్ బుక్స్ ను ఏర్పాటు చేసుకోవాలి. ఉదయం, సాయంత్రం, రాత్రి సమయాల్లో పోలీస్ శాఖ వారు మండపాలను పర్యవేక్షిస్తారు వారికి సహకరించాలి.
28. పోలీసు వారు సూచించిన పై నియమాలను మరియు నిబంధనలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రులు జరగడానికి పోలీసు వారికి సహకరించవలసిందిగా మనవి.

# రాజకీయ కుస్తీల్లో ప్రజా సమస్యలు గాలికి.!

- **కాంగ్రెస్–బీఆర్ఎస్ రాజకీయాలతో ప్రజా సమస్యలు పక్కదారి**
- **ప్రజా సమస్యలు పక్కనపెట్టి రాజకీయ రణరంగం సిగ్గుచేటు**
- **బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డా.గోగుల రాణా ప్రతాప్రెడ్డి**

**నర్సంపేట, సెప్టెంబరు 9 (సమయం న్యూస్)** : కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ ఆధిపత్య పోరును పక్కనపెట్టి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్రెడ్డి కోరారు. ప్రజల ఓట్లతో గెలిచి శాసనసభకు వెళ్లిన ప్రజాప్రతినిధులు వారి సమస్యలపై చర్చించాల్సింది పోయి పరస్పర విమర్శలు, ఆరోపణలు, ఆందోళనలతో సభను రాజకీయ రణరంగంగా మార్చడం సరికాదన్నారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు, పేదలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాటిపై అసెంబ్లీలో సమగ్ర చర్చ జరిపి పరిష్కారాలు చూపాల్సిన ప్రభుత్వం, ప్రతిపక్షాలు రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని విమర్శించారు. శాసనసభ రాజకీయ కుస్తీలకు వేదిక కాదని.. ప్రజల భవిష్యత్తుపై నిర్ణయాలు తీసుకునే ప్రజాస్వామ్య వేదిక అని పేర్కొన్నారు.

**విగ్రహ వివాదంతో అసలు సమస్యలు మరుగున...**

నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి విగ్రహం కూల్చివేత ఘటన చుట్టూ కొనసాగుతున్న ధర్నాలు, ఆందోళనలు, పరస్పర విమర్శలతో పట్టణంలోని అసలు సమస్యలు పక్కదారి పడుతున్నాయని రాణా ప్రతాప్రెడ్డి అన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి, నిరుద్యోగం, రైతుల సమస్యలు, పట్టణ అభివృద్ధి వంటి అంశాలపై నాయకులు దృష్టి పెట్టా లని సూచించారు. విగ్రహాల చుట్టూ రాజకీయాలు, ధర్నాలు చేయడం వల్ల ప్రజల సమస్యలు పరిష్కారం కావని అన్నారు. నర్సంపేట ప్రజలకు రాజకీయ రచ్చ కాకుండా మెరుగైన మౌలిక వసతులు, ఉద్యోగ అవకాశాలు, నాణ్యమైన వైద్యం, రహదారులు, తాగునీరు, జవాబుదారీ పాలన అవసరమని పేర్కొన్నారు.

**ఘనంగా 'పెద్ది' కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి...**

మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సేవలను గౌరవించేలా అన్ని రాజకీయ పార్టీల నాయకులతో చర్చించి, అన్ని వర్గాల అభిప్రాయాలను తీసుకోవాలని రాణా ప్రతాప్‌రెడ్డి సూచించారు. పట్టణంలో భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అందరూ కలిసి కృషి చేయాలని కోరారు. వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా నర్సంపేట గౌరవం, చరిత్ర, ప్రముఖుల సేవలను గౌరవించే విధంగా నిర్ణయం తీసుకోవాలని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఆరోపణలు, ప్రత్యారోపణలకు స్వస్తి పలికి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. నర్సంపేట అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్తులో ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్‌లీడర్, కౌన్సిలర్ జూలూరు రోజారాణి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వడ్డపల్లి నరసింహారాములు, పార్లమెంట్ కో–కన్వీనర్ కట్ల రామచంద్రరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షుడు తనుగుల అంబేద్కర్, నల్లబెల్లి అధ్యక్షుడు తడుక వినయ్, మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు, నియోజకవర్గ నాయకుడు జూలూరు మనీష్‌గౌడ్, నాయకులు ఠాకూర్ విజయ్‌సింగ్, కాసుల నాగేంద్రబాబు, పొనుగోటి రవీంద్రచారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోతంగల్ గ్రామానికి అరుదైన గౌరవం

### రాష్ట్ర స్థా యి 'వేదశాస్త్రి' పురస్కారానికి డా. ప్రదీప్ జంగం స్వామీజీ ఎంపిక!



**పోతంగల్, సెప్టెంబర్ 09 ( సమయం న్యూస్ ) :-** వేదశాస్త్ర పరిరక్షణ, వేద విద్య వ్యాప్తికి విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, డా. ప్రదీప్ నాగలింగప్ప జంగం స్వామీజీకి అరుదైన గౌరవం దక్కింది. ఆయన సేవలను గుర్తిస్తూ రాష్ట్ర స్థాయి ప్రతిష్ఠాత్మక 'వేదశాస్త్రి పురస్కారం–2026' కు ఎంపికయ్యారు. ఈ వార్త తెలియడంతో పోతంగల్ గ్రామంలో ఆనందోత్సవాలు వెల్లివిరిసాయి.గత కొంతకాలంగా డా. ప్రదీప్ జంగం స్వామీజీ వేద సంస్కృతిని కాపాడటంతో పాటు, ఎంతో మంది విద్యార్థులకు ఉచితంగా వేద విద్యను బోధిస్తూ ఆధ్యాత్మిక రంగానికి విశిష్ట సేవలు అందిస్తున్నారు. ఆయన చేస్తున్న ఆధ్యాత్మిక, సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రకటించినట్లు నిర్వాహకులు తెలిపారు.రాష్ట్ర స్థాయి వేదశాస్త్రి పురస్కారానికి ఎంపికైన డా. ప్రదీప్ జంగం స్వామీజీని రాబోయే సెప్టెంబర్ 20వ తేదీన మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో నిర్వాహకులు, వేద పండితులు ఘనంగా సన్మానించి పురస్కారాన్ని అందజేయనున్నారు.తన జన్మభూమి అయిన పోతంగల్ పేరును రాష్ట్ర స్థాయిలో ప్రఖ్యాతి గాంచేలా చేసిన డా. ప్రదీప్ స్వామీజీకి గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, గ్రామస్థులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వేద రక్షణకు ఆయన చేస్తున్న కృషి మరెంతో మందికి స్ఫూర్తిదాయకమని గ్రామస్థులు కొనియాడారు.

## చేయూత పింఛన్లపై వీడియో కాన్ఫరెన్స్ లో జలంధర్ రెడ్డి



**వలిగొండ సెప్టెంబర్ 09 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో చేయూత పింఛన్లకు సంబంధించిన అంశాలపై అధికారులు మరియు క్షేత్రస్థాయి సిబ్బందికి మార్గదర్శకాలు అందించేందుకు గౌరవ కమిషనర్, పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి (PR & RD) ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వలిగొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి మరియు వలిగొండ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. చేయూత పింఛన్ల అమలు, లబ్ధిదారుల వివరాల పరిశీలన, ధృవీకరణ ప్రక్రియ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు పలు సూచనలు చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పింఛన్ ప్రయోజనం సకాలంలో అందేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పింఛన్ల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, నిబంధనల అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలని, లబ్ధిదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొని, చేయూత పింఛన్లకు సంబంధించిన ప్రభుత్వ మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## శుద్ధీకరణ రాజ్యాంగ వ్యతిరేక విధానం

### తెలంగాణ దళితులారా.. కళ్లుతెరవండి: నీలం వెంకటస్వామి

**ఆలేరు, సెప్టెంబర్ 09(సమయం న్యూస్):** బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న దళిత సోదర, సోదరీమణులు ఆ పార్టీ గతంలో అనుసరించిన విధానాలను పరిశీలించి, దళితుల హక్కులు, ఆత్మగౌరవం కోసం ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్, మాజీ ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి నీలం వెంకటస్వామి అన్నారు. దళితులను అన్ని విధాలుగా వంచించిన పార్టీ బీఆర్ఎస్ అని ఆయన ఆరోపించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని హామీ ఇచ్చి, దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన అనంతరం దళితులకు ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ రాజయ్యకు ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చినప్పటికీ, అనంతరం ఆయనను అవమానించి పదవి నుంచి తొలగించారని ఆరోపించారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యలు, వ్యవహరించిన తీరును దళిత సమాజం గమనించాలని కోరారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన నాయకులను ప్రశ్నించే సమయం వచ్చిందని అన్నారు. దళితులపై జరుగుతున్న దాడులు, వేధింపులకు వ్యతిరేకంగా దళితులంతా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఏవైనా దళితుల హక్కులు, గౌరవానికి భంగం కలిగితే అందరూ ఏకతాటిపై నిలిచి రాజ్యాంగబద్ధంగా పోరాడాలని సూచించారు. ఇటీవల ఫామ్‌హౌస్ ముట్టడి కార్యక్రమానికి వెళ్లి న దళితులు, డప్పు కొట్టేందుకు వచ్చిన దళితులు తిరిగి వెళ్లిన అనంతరం ఫామ్‌హౌస్ రహదారిని పసుపుతో శుద్ధి చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయని తెలిపారు. ఒక సామాజిక వర్గానికి చెందిన ప్రజలు వెళ్లిన ప్రదేశాన్ని శుద్ధి చేయాలనే ఆలోచన రాజ్యాంగ విలువలకు, సమానత్వ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.

## ఇంటింటికీ మొక్కల పంపిణీ

**ఆలేరు, సెప్టెంబరు 9(సమయం న్యూస్):** పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని లక్ష్యంగా ఆలేరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని సిల్క్‌నగర్‌లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బిజన బాలమణి భాస్కర్ ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటి పరిసరాల్లో మొక్కలను నాటడంతో పచ్చదనం పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ప్రజలు మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనం పెంపొందించేందుకు చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకమని అధికారులు పేర్కొన్నారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులకు సూచించారు.

## కామ్రేడ్ కోలా కిషన్ సేవలు చిరస్మరణీయం

### నదీజలాల సాధన, గంధమల్ల రిజర్వాయర్ కోసం విశేష కృషి



**ఆలేరు, సెప్టెంబరు 9(సమయం న్యూస్):** ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సీనియర్ నాయకుడు, అమరజీవి కామ్రేడ్ కోలా కిషన్ 22వ వర్ధంతిని కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక స్థూపాల వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ కామ్రేడ్ కోలా కిషన్ ఈ ప్రాంత ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన ప్రజా నాయకుడని కొనియాడారు. ముఖ్యంగా ఈ ప్రాంత నదీజలాల సాధనతో పాటు గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణం కోసం ఆయన విశేషంగా కృషి చేశారని తెలిపారు. ఆలేరు నియోజకవర్గ పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దృష్టికి సమస్యలను తీసుకెళ్లిన నాయకుడు కోలా కిషన్ అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేసిన ఆయన సేవలు ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, రైతుల సంక్షేమం కోసం పోరాడిన కోలా కిషన్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆయన చూపిన ప్రజా ఉద్యమాల మార్గంలో పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పొన్నబోయిన రవి, కోలా దయానంద్, సుకేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నరు.

## అసభ్యకర వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

### తిన్మార్ మల్లన్నపై ఆలేరు పోలీసులకు తెలంగాణ రెడ్ల సంఘం ఫిర్యాదు



**ఆలేరు, సెప్టెంబరు 9(సమయం న్యూస్):** రెడ్లను ఉద్దేశించి అసభ్యకర, అవమానకర వ్యాఖ్యలు చేశారంటూ తెలంగాణ శాసనమండలి సభ్యుడు చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రెడ్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆలేరు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓకు సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రెడ్ల సంఘం మహిళా ప్రధాన కార్యదర్శి జాలపు వనజరెడ్డి మాట్లాడుతూ సెప్టెంబరు 5న నకిరేకల్‌లో ముఖ్యమంత్రి సభ సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి , ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తనకున్న సంబంధాలపై మీడియాతో మాట్లాడిన వ్యాఖ్యలను ఉద్దేశిస్తూ చింతపండు నవీన్ చేసిన వ్యాఖ్యలు రెడ్ల సమాజాన్ని అవమానించే విధంగా ఉన్నాయని ఆరోపించారు. ఒక సామాజిక వర్గాన్ని ఉద్దేశించి అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలోని వివిధ వర్గాల మధ్య అనవసరమైన అపోహలు, వైషమ్యాలకు దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల మధ్య సామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. సామాజిక వర్గాల మధ్య ఉద్రిక్తతలకు కారణమయ్యే వ్యాఖ్యలపై పోలీసులు సమగ్రంగా విచారణ చేపట్టి , చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రెడ్ల సంఘం నాయకులు అనంతుల ఎల్లారెడ్డి, జాలపు రాంరెడ్డి, జాలపు సిద్దారెడ్డి, శేఖర్‌రెడ్డి , వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టెట్ లో మాస్ కాపీయింగ్ పై సమగ్ర విచారణ జరపాలి

- అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- వరంగల్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ యూనియన్ అధికార ప్రతినిధి సింగనబోయిన శ్రీశైలం



**నర్సంపేట/వరంగల్, సెప్టెంబర్ 9 (సమయం న్యూస్)** : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో మాస్ కాపీయింగ్ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ యూనియన్ అధికార ప్రతినిధి, సామాజిక విశ్లేషకుడు సింగనబోయిన శ్రీశైలం డిమాండ్ చేశారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరిచి, నాణ్యమైన ఉపాధ్యాయులను ఎంపిక చేసేందుకు నిర్వహించే టెట్ పరీక్షలోనే అక్రమాలకు పాల్పడటం ఆందోళన కలిగించే విషయమన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన టెట్ పరీక్ష సందర్భంగా పది మంది అభ్యర్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడినట్లు వెలుగులోకి వచ్చిన ఘటనను తీవ్రంగా ఖండించారు. అక్రమ మార్గాల్లో అర్హత సాధించే వారు భవిష్యత్తులో ఉపాధ్యాయులైతే విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని శ్రీశైలం ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, మంచి నడవడికను బోధించి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులు అర్హత పరీక్షలోనే అక్రమాలకు పాల్పడటం బాధాకరమన్నారు. ఈ ఘటనపై కేవలం మాస్‌కాపీయింగ్ కు పాల్పడిన అభ్యర్థులపైనే కాకుండా, వారికి సహకరించిన వ్యక్తులు ఎవరైనా ఉన్నారా? ఈ వ్యవహారం వెనుక ఇతరుల ప్రమేయం ఉందా? అనే కోణాల్లోనూ విచారణ జరపాలని కోరారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను కాపాడేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ఘటనపై సిట్టి ంగ్ జడ్జి ఆధ్వర్యంలో సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులెవరైనా చట్ట పరంగా కఠినంగా శిక్షించాలని సింగనబోయిన శ్రీశైలం డిమాండ్‌చేశారు.

# రాజ్యాంగ పదవిని అవమానిస్తే సహించం..

### ఎస్సై రమేష్ కుమార్ కుల్కచర్ల పోలీస్ స్టేషన్,

**కుల్కచర్ల మండలం, సెప్టెంబర్,09(సమయం న్యూస్)** గణేష్ చవితి ఉత్సవాలను ప్రశాంతమైన, సురక్షితమైన మరియు సౌహార్ద్రపూర్వక వాతావరణంలో నిర్వహించేందుకు కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ ఉత్సవ నిర్వాహకులతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించినట్లు ఎస్సై రమేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు, భక్తులు మరియు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని పోలీస్ శాఖ పలు ముఖ్యమైన సూచనలు చేశారు. ఉత్సవాల విజయవంతమైన నిర్వహణకు నిర్వాహకులు పోలీస్ శాఖతో పూర్తి సహకారం మరియు నిరంతర సమన్వయం పాటించాలని సూచించారు.



**పోలీస్ శాఖ ముఖ్య సూచనలు:**

1. ఆన్‌లైన్ ద్వారా పోలీసులకు ముందస్తు సమాచారం – మెరుగైన సమన్వయంప్రతి గణేష్ మండపానికి సంబంధించిన ప్రతిష్ఠాపన, పండల్ వివరాలు, నిర్వాహకుల వివరాలు, కార్యక్రమాలు మరియు నిమజ్జనానికి సంబంధించిన సమాచారాన్ని పోలీస్ శాఖకు ఆన్‌లైన్ ద్వారా ముందస్తుగా తెలియజేయాలి. దీనివల్ల పోలీస్ శాఖతో సమర్థవంతమైన సమన్వయం సాధించి, అవసరమైన భద్రతా చర్యలు చేపట్టడానికి వీలవుతుందన్నారు.

**2. సంప్రదాయాలు, ఆచారాలను గౌరవిస్తూ నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలి**

గణేష్ ఉత్సవాలను మన సాంప్రదాయాలు, ఆచారాలు మరియు సంస్కృతికి అనుగుణంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి. నిర్వాహకులు తమ పరిధిలో జరిగే కార్యక్రమాలకు పూర్తి బాధ్యత వహిస్తూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు.

**3. ప్రతి గణేష్ మండపంలో CCTV ఏర్పాటు చేయాలి**

భద్రతను పెంపొందించేందుకు ప్రతి గణేష్ మండపం వద్ద CCTV కెమెరాలను ఏర్పాటు చేయడం తప్పనిసరిగా ప్రోత్సహించబడుతుంది. మండపం పరిసరాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడంతో పాటు, ఏదైనా సంఘటన జరిగినప్పుడు దర్యాప్తు మరియు నిందితుల గుర్తింపులో CCTV ఫుటేజీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

**4. DJలు, అధిక శబ్దంతో కూడిన లౌడ్‌స్పీకర్లకు అనుమతి లేదు**

గణేష్ విగ్రహాల నిమజ్జన సమయంలో DJలు మరియు అధిక శబ్దంతో కూడిన లౌడ్‌స్పీకర్లను వినియోగించరాదు. DJ నిర్వాహకులు మరియు ఆపరేటర్లు పోలీస్ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలి. నిమజ్జన సమయంలో DJ నిర్వహణకు సంబంధించి అడ్వాన్స్‌లు తీసుకోవద్దని, DJలను నిర్వహించవద్దని DJ ఆపరేటర్లకు స్పష్టంగా సూచించడం జరిగింది. ప్రజలకు అసౌకర్యం కలగకుండా మరియు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అందరూ సహకరించాలన్నారు.

**5. మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనరాదు**

గణేష్ నిమజ్జన సమయంలో ఎవరూ మద్యం సేవించి పాల్గొనరాదు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ఇతరులతో గొడవలకు దిగడం, అసభ్యంగా ప్రవర్తించడం లేదా ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా పబ్లిక్ న్యూసెన్స్‌కు పాల్పడడం పూర్తిగా నిషేధం. నిర్వాహకులు కూడా ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి, తమ బృందంలోని సభ్యులు క్రమశిక్షణతో వ్యవహరించేలా చూడాలి. పోలీసుల సూచన – నిర్వాహకుల సహకారమే ప్రధాన బలం గణేష్ ఉత్సవాలు ప్రజలందరికీ ఆనందాన్ని, భక్తిభావాన్ని పంచే విధంగా జరగాలంటే నిర్వాహకులు, భక్తులు, యువత మరియు ప్రజలు పోలీస్ శాఖతో పరస్పర సహకారం మరియు సమన్వయంతో వ్యవహరించడం అత్యంత అవసరం."భక్తితో ఉత్సవాలు – బాధ్యతతో నిర్వహణ – పోలీసులతో సమన్వయం – అందరి భద్రత" అనే స్ఫూర్తితో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కుల్కచర్ల ఎస్సై రమేష్ కుమార్ కోరారు.

# అసెంబ్లీ ని ఆధిపత్య పోరుకు వేదిక చేయొద్దు

- యువతకు ఉపాధి.. రైతులకు సాగునీరు ఇవ్వాలి
- 22-ఏ భూముల సమస్యను పరిష్కరించాలి
- బాధల్లో ప్రజలు.. బాధ్యత మరచిన పాలకులు?
- జనసేన నాయకుడు మేరుగు శివకోటి యాదవ్

**హనుమకొండ, సెప్టెంబరు 9 (సమయం న్యూస్)** : తెలంగాణలో నెలకొన్న ప్రధాన ప్రజా సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జనసేన పార్టీ వరంగల్ జిల్లా, నర్సంపేట నియోజకవర్గ నాయకుడు మేరుగు శివకోటి యాదవ్ డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ , బీఆర్ఎస్ పార్టీ ల ఆధిపత్య పోరుకు శాసనసభను వేదికగా మార్చొద్దని సూచించారు. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్ చార్జి నేమూరి శంకర్ గౌడ్ పిలుపు మేరకు వరంగల్ జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ అదాలత్ అమరవీరుల స్తూపం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టి కి తీసుకెళ్లారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని, 22–ఏ పరిధిలో ఉన్న పేదల భూముల సమస్యలను పరిష్కరించాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల సాగునీటి సమస్యలను పరిష్కరించడంతో పాటు శాసనసభలో ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించి, వాటికి పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు డా. గోళ్ళ రాజేంద్రప్రసాద్ , గడ్డం రాకేష్ , జిల్లా నాయకులు కరాటే ప్రభాకర్ , పద్మజాదేవి, గాదె పృధ్వీ, మెడిద ప్రశాంత్ రెడ్డి, బర్ల శివ, ముక్కా అభిలాష్ , కొల్లూరి అనుదీప్ , ఎలబోయిన డేవిడ్ , మేకల ప్రసన్నకుమార్ , వీరమహిళలు షబానా హర్షియా, భయ్యా పద్మ, రామంచ దినేష్ , స్వర్గం హరిధర్ కుమార్ , ఆమంచ సునీల్ , రాజేందర్ , నవీన్ , అనిల్ తదితరులు పాల్గొన్నారు.




# ఆలేరులో ఘనంగా జాతీయ క్రీడా పోటీలు

- చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి: మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలామణి భాస్కర్

**ఆలేరు: సెప్టెంబర్ 09(సమయం న్యూస్):** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ క్రీడా పోటీలు ఆలేరులో ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం స్థానిక జడ్పీ హైస్కూల్ (బాలుర) ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి ఎర్ర లక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలామణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలామణి భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను కనబరచాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని తెలిపారు. నిత్యం చదువుతో ఒత్తిడికి గురయ్యే విద్యార్థులకు క్రీడలు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తాయని, క్రీడా స్ఫూర్తితో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదల వంటి లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొ నడం ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం, జట్టుగా పనిచేసే నైపుణ్యం అభివృద్ధి చెందుతాయని, ఇవి భవిష్యత్తులో వారి విద్యా, వ్యక్తిగత అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు క్రీడలను కేవలం పోటీలకే పరిమితం చేయకుండా తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీల్లో పాల్గొ నే విద్యార్థులకు నిర్వాహకులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిభను ప్రదర్శించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు గడసంతల మధుసూదన్, మాదను జోసెఫ్, భాస్కర్, పూల నాగయ్య, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయురాలు వసంతకుమారి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్.బి శ్రీనివాస్ రెడ్డి

**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్, 09 (సమయం న్యూస్)** కొడంగల్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా నిర్వహించే తెలంగాణ భాషా దినోత్సవాన్ని కళాశాల తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కాళోజీ చిత్ర పటాన్ని పూల మాలతో అలంకరించి నివాళులర్పించారు. తెలంగాణ ప్రాంతం అనేక మంది కవులు, కళాకారులు, సంఘ సంస్కర్తలు, పోరాట యోధులకు నిలయమని, అటువంటి వ్యక్తుల కోవలో కాళోజీ ప్రథముడన్నారు. కాళోజీ నిజాం నిరంకుశంత్వాన్ని ఎదురించి ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని చెప్పారన్నారు. కాళోజీ ప్రజల గొడవను తన గొడవగా భావించి ప్రజా సమస్యల పట్ల పోరాడిన గొప్ప సామాజిక వేత్త అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలకై కాళోజీ వంటి పోరాట యోధుల కృషి ఫలితంగానే తెలంగాణ ఏర్పడిందని, ఇప్పటికీ నీళ్ల విషయంలో తెలంగాణకు ఇంకా సరైన న్యాయం జరుగడం లేదన్నారు. తెలుగు భాష ప్రత్యేకించి తెలంగాణ యాస ఎంతో ప్రాముఖ్యమైనవని, వాటి పరిరక్షణకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లేనిచో ఐక్య రాజ్య సమితి హెచ్చరించినట్లు తెలుగు భాష త్వరలోనే అంతరించి పోయే ప్రమాదముందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం, ఐ.క్యూ.ఎ.సి కోఆర్డినేటర్ టి. రాంబాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. ఆర్. శ్రీనివాస్, డా. వి. శ్రీధర్ కుమార్, బంటు నర్సిములు, పి.వెంకటయ్య, ఇతర అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

